Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విశాఖపట్నం Visakhapatnam | సంపుటి : 01 | సంచిక : 144 | శుక్రవారం | మే 1, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 01 | Issue No : 144 | Friday | 1 MAY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana




## మహిళా కోటా బిల్లు

» బిజెపికి వ్యతిరేకంగా సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నిరసన

లక్నో : మహిళా రిజర్వేషన్ల విషయంలో బిజెపి ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) ఎమ్మెల్యేలు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం నిరసన చేశారు. ఏప్రిల్ 16-18 వరకు జరిగిన లోక్‌సభ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లులను ప్రతిపక్ష పార్టీలు అడ్డుకున్నాయి. దీంతో మహిళా రిజర్వేషన్‌కు అమలుకు నోచుకోకపో వడానికి ప్రతిపక్ష పార్టీలే కారణమని.. దానికి ఆ పార్టీలే బాధ్యత వహించాలని ఉత్తరప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వం రేపు ప్రత్యేకంగా జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టనుంది.

- మిగతా 2లో..

## అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి



- కేబినెట్ సమావేశంలో మంత్రులకు చంద్రబాబు పలు సూచనలు
- మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ విమర్శలను ఖండించిన చంద్రబాబు
- సింగపూర్ మరెవరికీ ఇవ్వని అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని వెల్లడి
- అమరావతిలోని భవనాలను ప్రపంచ స్థాయిలో నిర్మిస్తున్నామన్న సీఎం
- ఏఐ, ఐటీపై మంత్రులు అవగాహన పెంచుకోవాలని సూచన
- జలధార, జల హారతి, సూర్యఘర్ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మంత్రుల సింగపూర్ పర్యటన, అభివృద్ధి పనులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. సింగపూర్ ప్రభుత్వం మరెవరికీ ఇవ్వని అరుదైన అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని, దీనిని రాజకీయం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

పాలనలో మెళకువలు, సంపద సృష్టి కోసం జరిగిన ఈ పర్యటనను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. "మనం ఇతర దేశాల కంటే తక్కువ ఖర్చుతో, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణాలు చేస్తున్నాం" అని స్పష్టం చేస్తూ, రాజధాని అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా ఎదుర్కోవాలని ఆదేశించారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచస్థాయి కట్టడాలుగా నిర్మిస్తున్నామని, ఇవి రాష్ట్రానికి గర్వకారణంగా మారుతాయని సీఎం తెలిపారు. ధరల విషయంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను వాస్తవాలతో సహా తిప్పికొట్టాలని సూచించారు.

2 లో..

## రూపాయి చారిత్రక పతనం..


### 95 మార్కును దాటిన విలువ

- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో భగ్గుమంటున్న చమురు ధరలు
- రూపాయి పతనానికి ఫెడ్ నిర్ణయాలు కూడా ఓ కారణం
- ఈ ఏడాదిలోనే 5.8 శాతం క్షీణించిన రూపాయి విలువ



2 పేజీలో..

న్యూఢిల్లీ : దేశీయ కరెన్సీ రూపాయి గురువారం భారీ పతనాన్ని నమోదు చేసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 95 మార్కును దాటి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా, ఇరాన్ మధ్య తీవ్రమవుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కలిన వైఖరి వంటి అంశాలు రూపాయిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాయి. గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.07 వద్ద ఆల్-టైమ్ కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత మరింత బలహీనపడి ఇంట్రాడేలో 95.126 స్థాయికి, సెషన్ మధ్యలో 95.20 స్థాయికి కూడా పడిపోయింది.



## కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- శుక్రవారం పమిడిముక్కలలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం
- 'మేడే' సందర్భంగా కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి
- గుడ్లవల్లేరులో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

2 లో..

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :
కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం పర్యటించనున్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నారు.

## పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం

"పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ - మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం

- పాడి పశువుల నుంచి కోట్ల ఆర్థిక వృద్ధి
- రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- ప్రతి ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయ వాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశువులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2025-26 సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు.



2 పేజీలో..

అయినప్పటికీ సంప్రదాయ యాజమాన్య పద్ధతులు, కూలీల కొరత, పశుగ్రాసాల లోపం, పెరుగుతున్న దాణా ఖర్చులు వంటి సమస్యల కారణంగా ఆశించిన స్థాయి వృద్ధి సాధ్యంకావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, అదే సమయంలో పశుసంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసుకునే అవకాశాలు



## విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు

- మంత్రి లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక సత్ఫలితాలు...
- హోం మంత్రి వంగలపూడి అనిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మ కమైన మార్పులు తీసుకొచ్చారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంత్రి లోకేష్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళిక మంచి ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 81.14% నుంచి 85.25%కి పెరగడం, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో 78.39%

2 లో

## తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులు వర్షాలు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో విపరీతమైన ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు పడనుండడంతో కొంత ఉపశమనం కలగనుంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి దక్షిణ కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. ద్రోణి ప్రభావంతో ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్ర, శనివారాలు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన జల్లులు ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది.

- మిగతా 2లో..

## ఏపీకి రూ. 1,192 కోట్ల నిధులు మంజూరు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏపీకి కేంద్ర ప్రభుత్వం రూ. 1,192.16 కోట్ల నిధుల ను మంజూరు చేసింది. ఈ నిధుల విడుదలపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. లక్షలాది మంది కూలీలకు వేతనాలు నేరుగా అందేలా పారదర్శక వ్యవస్థను బలోపేతం చేస్తామని, పెండింగ్ పనులను వేగంగా



పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా, గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భరోసా కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తామని తెలిపారు.

## టెన్త్‌లోనూ బీసీ బిడ్డల హవా

- రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతం అధికం
- విద్యార్థుల సంఖ్యాపరంగా ఎంజేపీదే ఉత్తీర్ణతా శాతం టాప్
- 100 బీసీ గురుకులాల్లో 32 గురుకులాల్లో నూరు శాతం ఫలితాలు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- ఇంటర్ లోనూ సత్తాచాటిన బీసీ విద్యార్థులు
- బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు... 85.99 శాతం ఉత్తీర్ణత
- బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాల సాధనపై మంత్రి సవిత హర్షం
- సత్ఫలితాలిచ్చిన మంత్రి లోకేశ్ వంద రోజుల ప్రణాళికలు
- కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమే ఈ అత్యుత్తమ ఫలితాలు : మంత్రి సవిత
- అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు
- కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపీ కార్యదర్శి మాధవీలతను అభినందించిన మంత్రి సవిత

» ఏంజేపీలో 96.02 శాతంతో ఉత్తీర్ణత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : పదో తరగతి ఫలితాల్లోనూ మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ గురుకుల పాఠశాలలు(ఎంజేపీ) విద్యార్థులు సత్తాచాటారు. 96.02 శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ప్రభుత్వ పరిధిలో నడిచే విద్య సంస్థలు, గురుకులాల్లో ఎంజేపీ గురుకులాలు ఫస్ట్ ప్లేస్ లో నిలిచాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు వంద బీసీ గురుకుల విద్యా సంస్థలు హాజరుకాగా, 32 గురుకులాల్లో వంద శాతం మేర ఫలితాలు రావడం విశేషం.

రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకులాలు 10 శాతం కంటే అధికంగా ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ రెండో తేదీన ముగిశాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. 6,18,131 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, 85.25 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు టెన్త్ లోనూ సత్తాచాటారు.

2 లో



# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సాను భూతి వచనాలు లేవు. ఇప్పడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# టెన్త్‌లోనూ బీసీ బిడ్డల హవా



ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్ట్ ఇంటర్ లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణత శాతం సాధించి భేష్ అనిపించుకున్నారు. టెన్త్ లోనూ అదే స్థాయిలో ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వంద ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,433 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతం మేర ఉత్తీర్ణతా శాతంతో ఉత్తీర్ణులయ్యారు.

**విద్యార్థుల సంఖ్యాపరంగా టాప్ ప్లేస్ ఎంజేపీదే...** గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం ప్రకారం 96.02 శాతంతో ద్వితీయ స్థానంలో ఎంజేపీ గురుకుల విద్యార్థులు నిలిచారు. స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య ప్రకారం చూస్తే ఎంజేపీ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. వంద బీసీ గురుకులాలకు చెందిన 5,501 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతంతో 5,274 మంది మేర ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల కు చెందిన విద్యార్థులు 96.04 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే 0.02 శాతంతో ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు ముందంజలో నిలిచారు. టెన్త్ పరీక్షలకు 50 ఏపీ రెసిడెన్షియల్ కు చెందిన విద్యార్థులు 3,135 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఆ లెక్కన చూస్తే, ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ విద్యార్థులే టాప్ లో నిలిచినట్లు.

**గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత :** గతేడాది కంటే ఎంజేపీ స్కూళ్లలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది పదో తరగతి పరీక్షల్లో 95 శాతం మేర ఎంజేపీ విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఈ ఏడాది 96.02 శాతంతో ఎంజేపీ విద్యార్థులు సత్తాచాటారు. గతేడాది కంటే 1.02 శాతం మేర ఫలితాలు అధికంగా రావడం గమనార్హం. 2024-25 విద్యా సంవత్సరంలో 5,355 మంది పరీక్షలు రాయగా, ఈ ఏడాది 5,501 మంది పదో తరగతిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షలకు వంద ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాయగా, 32 గురుకులాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాసయ్యారు. ఎంజేపీ గురుకులాల్లో నంద్యాల జిల్లా నరవాడకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఆ పాఠశాలకు చెందిన శ్రీసాయి 596 మార్కులతో ఎంజేపీ గురుకులాలకు చెందిన విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచారు. రీటా సాహితి 593 మార్కులు, యశస్విని 589 మార్కులు సాధించి రెండు మూడు స్థానాల్లో నిలిచారు.

**మొన్న ఇంటర్ లో... నేడు టెన్త్ లో...** ఈ నెల 15న విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ ఎంజేపీ విద్యార్థులు సత్తా చాటిన విషయం విదితమే. జూనియర్ ఇంటర్ లో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ విద్యార్థుల ఉత్తీర్ణత సాధించారు. నేడు విడుదలైన టెన్త్ పరీక్షల్లోనూ 96.02 శాతం బీసీ బిడ్డలు ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. టెన్త్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 85.25 శాతం కాగా, ఎంజేపీ ఉత్తీర్ణతా శాతం 96.02 శాతంగా నమోదైంది. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతానికి పైగా సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 77 శాతం రాగా, ఎంజేపీలో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో రాష్ట్రస్థాయి ఫలితాలు 81 శాతం రాగా, ఎంజేపీ విద్యార్థులు 94 శాతంతో సత్తా చాటారు. ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాలు జూనియర్ ఇంటర్ లో ప్రథమ స్థానంలో, సీనియర్ ఇంటర్ లో రెండో స్థానం నిలవడం గుర్తించుకోదగ్గ విషయం.


**బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు..** ఎంజేపీ గురుకులాలతో పాటు బీసీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులూ పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల నుంచి 8,466 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 7,280 మంది ఉత్తీర్ణత సాధించారు. 85.99 శాతం మేర బీసీ హాస్టళ్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. వారిలో 5,187 మంది ఫస్ట్ క్లాస్ లో, 1,437 మంది సెకండ్ క్లాస్, 652 మంది థర్డ్ క్లాస్ లో ఉత్తీర్ణులయ్యారు. 1,001 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు గతేడాది 77.22 శాతంతో ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 8.78 శాతం అధికంగా 85.99 శాతంతో పాసవ్వడం విశేషం. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీ హై స్కూల్ విద్యనభ్యసిస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థిని కె.మానస మ్యాథ్స్ లో వందకు వంద మార్కులు సాధించడం విశేషం.

**అమరావతిలో సంబరాలు :** టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 96.02 శాతంతో ఉత్తీర్ణత సాధించడంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవితను ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది కంటే అత్యధిక ఫలితాలు సాధించినందుకు కార్యదర్శి సత్యనారాయణకు, మాధవీలతకు స్వీట్లు అందజేసి, మంత్రి అభినందించారు.

**సత్ఫలితాలిచ్చిన వంద రోజుల ప్రణాళికలు : మంత్రి సవిత :** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ గురుకులు, బీసీ హాస్టళ్ల విద్యార్థులు సత్తా చాటడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీలో 96.02 శాతంతో, బీసీ హాస్టళ్లలో 85.99 శాతంతో ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. మంత్రి లోకేశ్ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలు సత్ఫలితాలిచ్చాయన్నారు. బీసీ బిడ్డలు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంకల్పమన్నారు. విద్యతోనే అత్యున్నత స్థానాలు సాధ్యమని నమ్మి, ఎంజేపీ, బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రెండేళ్లలో పెద్దఎత్తున నిధులు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బీసీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు బీసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరఫున మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

### కృష్ణా జిల్లాలో ముఖ్యమంత్రి

# చంద్రబాబు పర్యటన



'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలకు వెళ్లనున్నారు. ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.63,158 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో పేదలకు అందించింది. ప్రతీ నెల కృష్ణాజిల్లాలో 2.34 లక్షల మందికి రూ.102 కోట్లను ప్రభుత్వం పింఛను రూపంలో ఇస్తోంది. పింఛన్ల పంపిణీ అనంతరం 'మేడే'ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు భవన నిర్మాణ కార్మికులతో సమావేశం అవుతారు. గుడ్లవల్లేరులో నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** కృష్ణా జిల్లాలో పేదల సేవలో, మేడే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం నుంచి బయలుదేరి పమిడిముక్కల మండలం, వీరంకిలాకు గ్రామానికి ఉదయం 10.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి పమిడిముక్కలకు 10.25 గంటలకు చేరుకుని ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలోని ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్తారు. వారికి పింఛను అందించి వారితో కాసేపు మాట్లాడతారు. ఎన్టీఆర్ కాలనీ నుంచి వీరంకిలాకు గ్రామానికి చేరుకుంటారు. మేడే సందర్భంగా మధ్యాహ్నం 12.45 గంటలకు భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 01.55 పామర్రు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ముగించుకుని 03.40 గంటలకు గుడ్లవల్లేరు చేరుకుంటారు. 03.50 గంటలకు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# రూపాయి చారిత్రక పతనం..



కేవలం ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు రూపాయి విలువ సుమారు 5.8 శాతం మేర క్షీణించడం గమనార్హం.

**భగ్గుమంటున్న చమురు ధరలు**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవడం, నౌకా దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో సరఫరాపై తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 120 డాలర్ల సమీపానికి చేరి, దాదాపు నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ 114.10 డాలర్ల వద్ద, యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (ఔ×) క్రూడ్ 110.28 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

**ఫెడ్ నిర్ణయాల ప్రభావం**

మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ, భవిష్యత్తులో కఠినంగా వ్యవహరిస్తామనే సంకేతాలు ఇచ్చింది. జెరోమ్ పావెల్ నేతృత్వంలోని ఈ నిర్ణయాలు డాలర్‌ను బలపరిచాయి. ఫలితంగా రూపాయి వంటి వర్ధమాన దేశాల కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఈ ప్రతికూల పరిణామాలు దేశీయ స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం చూపాయి. గురువారం ఉదయం సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు దాదాపు 1 శాతం నష్టాలతో ట్రేడ్ అయ్యాయి.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

- కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ
- హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం
- సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

**జనగామ,** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్సడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం



విస్తృతంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా, అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నెల నుండి శిఃఃఃఖజూఖప్త్రంఎఅశ్రీవ.అఅ (ష్ట్రజా://ఃఃఃఖజూఖప్త్రంఎఅశ్రీవ.అఅ) "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచనలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఏర్పడి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డా. బైరాగి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు

ఉత్తీర్ణత నమోదవడం ఆయన దూరదృష్టి, పక్కా ప్రణాళికకు నిదర్శనమని అన్నారు.

ఈ ఫలితాల్లో బాలికలు 87.90% ఉత్తీర్ణతతో ముందంజలో నిలవడం శుభపరిణామమని మంత్రి అనిత పేర్కొన్నారు. జిల్లాల వారీగా చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం, విజయనగరం జిల్లా మూడో స్థానం, అనకాపల్లి జిల్లా ఆరో స్థానం సాధించడం ఆనందకరమని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో వచ్చిన ఈ గుణాత్మక మార్పుకు మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ కారణమని ఆమె అభిప్రాయపడ్డారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. అలాగే పరీక్షల్లో విఫలమైన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, మరింత కృషి చేసి మళ్లీ ప్రయత్నించి విజయాన్ని సాధించాలని మంత్రి అనిత సూచించారు.

## మహిళా కోటా బిల్లు

యోగి ఆదిత్యనాథ్ మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రజలను తప్పుదారి పటిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్పి ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని రాసిన బ్యానర్లు పట్టుకుని అసెంబ్లీ ప్రాంగణంలో చౌదరి చరణ్ సింగ్ విగ్రహం ముందు ఎస్పీ సభ్యులు నిరసన చేపట్టారు. కాగా, బిజెపి ఈ చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను మహిళలకు ఉద్దేశపూర్వకంగా నిరాకరిస్తోంది. ఈ చట్టం ద్వారా తమ సొంత ప్రయోజనాల కోసమే నియోజకవర్గాల పునర్విభజనను సులభతరం చేయడానికే ఈ చట్టానికి సవరణలు తెచ్చిదని ఎస్పీ ఎమ్మెల్యే సంగ్రామ్ సింగ్ యాదవ్ మీడియాతో అన్నారు. ఈ విషయంలో బిజెపి బండారం బయటపడింది. బిజెపి మొదటి నుంచి మహిళలకు వ్యతిరేకంగా ఉంది. మహిళల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడింది మా నాయకులైన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా, ములాయం సింగ్ యాదవ్‌లే అని ఆయన అన్నారు. ఈ నిరసనల్లో మరో ఎస్పి ఎమ్మెల్యే అమితాజ్ బాజ్‌పాయ్ వెంటనే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో ఆమోదించిన చట్టాన్ని అమలు చేయడంలో బిజెపి ఎందుకు విఫలమవుతోందని ఆయన ప్రశ్నించారు.

## అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

ఇంధన కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సాధారణ స్థితికి తెచ్చిందని గుర్తు చేశారు.రాష్ట్ర పాలనలో ఏఐ, ఐటీ వినియోగాన్ని పెంచాలని... మంత్రులు కూడా ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఉద్యోగుల నియామకాల్లో కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలనే ఆలోచనను పంచుకున్నారు.కేవలం రాజకీయాలే కాకుండా, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలని మంత్రులను ఆదేశించారు. జలధార, జల హారతి, సూర్యఘర్ (ఇళ్లపై సోలార్) వంటి కార్యక్రమాల లక్ష్యాలను వేగంగా చేరుకోవాలని సూచించారు.

## టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

### నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందనలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

తెలుగుదేశం పార్టీ అత్యున్నత విభాగమైన పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికై, బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర కి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మచిలీపట్నం నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ ప్రతినిధులు ఆయనను కలిసి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి.

ఈ సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ.. కొల్లు రవీంద్ర కి పొలిట్ బ్యూరోలో చోటు దక్కడం నియోజకవర్గానికి గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మచిలీపట్నం సర్వతోముఖాభివృద్ధితో పాటు, క్రైస్తవ మైనారిటీల సంక్షేమం కోసం మంత్రి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలోమచిలీపట్నం నియోజ క వర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు రమేష్ బాబు ప్రధాన



కార్యదర్శి తలారి పాల్ సభ్యులు జొన్నల సురేష్ బాబు ప్రేమ్ కుమార్ నవమణి రాజు జాషువా, యాకోబు, పాల్గొని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కి దైవ ఆశీస్సులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీపీఓ ధనలక్ష్మి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా నూతన పంచాయతీ అధికారి (డీపీఓ)గా నియమితులైన ఎం. ధనలక్ష్మి గురువారం జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ భేటీలో ఆమె కలెక్టర్‌కు మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చిత్తూరు జిల్లా పలమనేరులో డ్వామా (DWMA) అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సేవలందించిన ధనలక్ష్మి, పదోన్నతిపై ఇక్కడ బాధ్యతలు చేపట్టను న్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పంచాయతీల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో పాలనాపరమైన సంస్కరణలు మరియు పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ ఆమెతో చర్చించారు. బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లా అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు దిశానిర్దేశం చేశారు.

## అక్షర యోధుల అపురూప కలయిక పత్రికా రంగ ప్రముఖుల సందడి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



వార్తా ప్రపంచంలో నిరంతరం బిజీగా ఉండే అక్షర యోధులు ఒకే చోట చేరి సందడి చేశారు. వార్తాప్రభ ఎడిటర్ శ్రీరామ్ యాదవ్ మనవడి అన్నప్రాసన మహోత్సవం గురువారం వేడుకగా జరిగింది. ఈ శుభకార్యానికి తెలుగు పత్రికా మరియు టీవీ రంగాలకు చెందిన పలువురు సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు హాజరై సందడి చేశారు.

ఒకే వేదికపై దిగ్గజాలుఈ వేడుకలో భాగంగా మీడియా రంగానికి చెందిన ప్రముఖులు ఒకరినొకరు కలుసుకుని, పలకరించుకోవడం విశేషం.ప్రజాభూమి ఎడిటర్ అక్కిరెడ్డిపల్లి రామ్మోహన్ రెడ్డి కోస్తా ప్రభ ఎడిటర్ కే. ప్రసాద్ బాబు నెంబర్ వన్ టీవీ చీఫ్ ఎడిటర్ వెంకీ వార్త మండల ఎడిటర్ నమ్మయ్య సాక్షి మచిలీపట్నం (ఆర్.సి ఇంచార్జ్) అంబటి శేషుబాబు,వార్తప్ర భ సబ్ ఎడిటర్ బత్తుల రామకృష్ణ ప్రజాభూమి కృష్ణాజిల్లా బ్యూరో అనంత సురేష్ వార్తప్రభ మైలవరం ఎన్టీఆర్ జిల్లా బ్యూరో వెంకటరత్నం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు.సౌభాతృత్వం.. స్నేహపూర్వక చర్చలుఅనునిత్యం వార్తల వేటలో ఉండే జర్నలిస్టులందరూ ఈ వేడుకలో ఒకచో ట చేరడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. శ్రీరామ్ యాదవ్ మనవడిని దీవించడంతో పాటు, ప్రస్తుత మీడియా రంగ పరిస్థితులు మరియు వృత్తిపరమైన అంశా లపై వీరందరూ స్నేహపూర్వకంగా చర్చించుకున్నారు.

వేర్వేరు సంస్థలకు చెందిన వారైనప్పటికీ, జర్నలిజం అనే ఒకే కుటుంబ సభ్యులుగా వీరందరూ కలిసి దిగిన గ్రూప్ ఫోటో ఇప్పుడు మీడియా సర్కిల్స్‌లో హైలెట్‌గా నిలిచింది.ఈ సంద ర్భంగా శ్రీరామ్ యాదవ్ కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులకు సాదర స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నారా లోకేష్ కి అభినందనలు తెలియజేసిన కాగిత కృష్ణ ప్రసాద్

ప్రజాభూమి పెడన



తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు ఉదయం తన ఛాంబర్‌లో కొలువుదీరిన సందర్భంగా మంత్రులు, ఎంపీలు మరియు సహచర ఎమ్మెల్యేలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. నాలాంటి ఎంతో మంది యువ రాజకీయ నాయకులకు లోకేష్ ఆదర్శం. ఎన్నో అడ్డంకులను అలవోకగా ఎదుర్కొన్నారు, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను చిరునవ్వుతో స్వీకరించారు. యువగళం పాదయాత్రతో కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే లోకేష్ నేడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడం పార్టీ శ్రేణుల్లో, ముఖ్యంగా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వారి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని బలంగా విశ్వసిస్తున్నాను.

## చారిత్రాత్మక నిర్ణయం

## షరతుల పట్టాల భూములకు విముక్తి

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ బాలశౌరి

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
అమరావతి



ఆంధ్రప్రదేశ్ రైతాంగం దశా బ్దాలుగా ఎదుర్కొంటున్న షర తుల పట్టాల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1920వ దశకంలో బ్రిటీష్ పాలనలో అణగారిన వర్గా ల కు కేటాయించిన భూములపై ఉన్న ఆంక్షలను తొలగిస్తూ ప్రభు త్వం తీసుకున్న నిర్ణయం పట్ల మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.సమస్య నేపథ్యం - పరి ష్కారంచారిత్రక చిక్కుముడి 1932-34 మధ్య రూపొందించిన రీసెటి ల్మెంట్ రిజిస్టర్ (RSR) ఆధారంగా ఈ భూములను ప్రభుత్వ భూ ములుగా పేర్కొ న్నా రు. రైతుల ఇబ్బందులు అడంగల్‌లో పట్టాదారు కాల మ్ లో రైతుల పేర్లు ఉన్నప్పటికీ, రిమార్కుల కాలమ్‌లో ప్రభుత్వ భూమి అని ఉండ టంతో క్రయవిక్రయాలకు, రుణాలకు అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం ఆంక్షల న్నీ తొలగించడంతో రైతులకు భూములపై పూర్తిస్థాయి హ క్కులు లభించాయి. ఇకపై ఈ భూములను బ్యాంకుల్లో కుదువ పెట్టుకో వచ్చు లేదా స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు. కృష్ణా జిల్లాకు సింహభాగం లబ్ధిరాష్ట్రవ్యాప్తంగా మొత్తం 33,01 2.35 ఎకరాలపై నిషేధం ఎత్తివేయగా, అందులో అత్యధికంగా కృష్ణా జిల్లాలోనే 18,380.76 ఎకరాలు ఉండటం విశేషం.జిల్లాలో లబ్ధి పొందే రైతుల వివరాలు నియోజకవర్గం లబ్ధి పొందే రైతుల సంఖ్యఅవనిగడ్డ 15,791 మందిమచిలీపట్నం 1,486 మందిగుడివాడ 1,107 మందిరైతాంగానికి మేలు చేసేలా ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు బాలశౌరి జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నిర్ణయం ద్వారా కృష్ణా జిల్లా రైతులకు దశాబ్దాల కల నెరవేరిందని ఆయన కొనియాడారు.

## బూత్ కన్వీనర్ కుమార్తె పెళ్లికూతురు వేడుకలో మంత్రి కొల్లు రవీంద్ర సందడి

### ఆశీర్వదించిన మంత్రి..ప్రేమాభిమానాలతో సాదర స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి


మచిలీపట్నం 41వ డివిజన్ బూత్ కన్వీనర్ విరరావు రామకృష్ణ గృహంలో సందడి నెలకొంది. రామకృష్ణ కుమార్తె వేదవల్లి వివాహ ముందస్తు వేడుకల్లో భాగంగా నిర్వహించిన పెళ్లికూతురుని చేసే' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.సాదర స్వాగతం - ఆత్మీయ పలకరింపులు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్రకు రామకృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సాధారణ కార్యకర్త ఇంటి వేడుకలో మంత్రి స్వయంగా పాల్గొనడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వధువు వేదవల్లిని ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు అందజేశారు. నూతన దంపతుల జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆయన ఆకాంక్షించారు.ముందస్తు వేడుకలో పార్టీ శ్రేణుల కోలాహలంకేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, కిందిస్థాయి కార్యకర్తల సుఖదుఃఖాల్లో భాగస్వాములవ్వడం మంత్రికి అలవాటని పార్టీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలోస్థానిక డివిజన్ ముఖ్య నాయకులుబూత్ లెవల్ కార్యకర్తలుఅనుబంధ విభాగాల ప్రతినిధులుపెద్ద సంఖ్యలో పాల్గొని వధువుకు మంగళ హారతులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి రాకతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది.



## టెన్త్ పరీక్షల్లో శ్రీ గౌతమ్ హై స్కూల్ విద్యార్థుల విజయ భేరి

### స్వీట్లు పంపిణీ చేసి విద్యా ర్థులను అభినందించిన హైస్కూల్ అధినేత సూర్యారావు




ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ, పదవ తరగతి పరీక్షల్లో చిట్టినగర్ లోని శ్రీ గౌతమ్ హై స్కూల్ విద్యార్థులు 100% ఉత్తీర్ణులై అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయభేరి మ్రోగించారు. టెన్త్ పరీక్షల్లో 581 మార్కులు సాధించిన జి.శివ కార్తీక్ స్కూల్ టాపర్ గా నిలిచాడు. అలాగే 574 మార్కులతో కె.ప్రణీత్ ద్వితీయ స్థానంలో, 570 మార్కులతో ఆర్. అఖిల్ కుమార్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్లో విజయోత్సవ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎన్. సూర్యారావు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధిం చారని, వారిలో 98% ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధిం చారని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా తమ విద్యాసంస్థలు టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయభేరి మ్రోగి స న్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యా ర్థినీ విద్యా ర్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ ప్రిన్సిపాల్ పి. తులసి పర్యవేక్షించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీరామ్, ఇన్చార్జులు ఉమ, రేష్మ, మ ధు లత, శ్రీదేవి సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూలు సిబ్బంది మిఠాయిలు పంచుకొని ఆనందోత్సాహాలతో బాణ సంచా కాల్చి సందడి చేశారు.

## పెదపట్నంలో పేర్ని కిట్టు సందడి

### వివాహ వేడుకలో వధూవరులకు ఆశీస్సులు
### చేబత్తుల బాలకృష్ణ వివాహానికి హాజరైన యువ నేత
### నాయకులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఘనంగా వేడుక



ప్రజాభూమి రూరల్ కృష్ణా జిల్లా

పెదపట్నం గ్రామంలో జరిగిన చేబత్తుల బాలకృష్ణ వివాహ వేడుక అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి మాజీ మంత్రి పేర్ని నాని తనయుడు, మచిలీపట్నం వైఎస్‌ఆర్ సీపీ ఇంచార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.ఆత్మీయ పలకరింపు - అభినందనలుకళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించిన పేర్ని కిట్టు, వారికి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులు కిట్టుకు సాదరంగా ఆహ్వానించి ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారుతరలివచ్చిన నాయకగణంఈ వేడుకలో వైఎస్‌ఆర్ సీపీ పార్టీ శ్రేణులు మరియు స్థానిక ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న ప్రముఖులలో గడిదేసి రాజు (నార్త్ మండల రైతు అధ్యక్షుడు)గడిదేసి బాలయేసు (నార్త్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు)బొట్ల రాము (తాళ్ళపాలెం పార్టీ అధ్యక్షుడు)లేళ్ల జో (పార్టీ నాయకులు) పాతపాటి పండు, పాతపాటి దేవ, పాతపాటి విజయరాజు పీతల నానిబాబు, ముంద్రు దావీదు రాజుముఖ్య నాయకులతో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పెళ్లి వేదిక వద్ద పండుగ వాతావరణం నెలకొంది. పేర్ని కిట్టు రాకతో కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలెత్తింది.

## కొండలమ్మ తల్లి సన్నిధిలో వైభవంగా అన్నప్రాశన

- కుటుంబ సభ్యులు, మీడియా ప్రముఖుల సమక్షంలో వేడుక
- వార్త ప్రభ ఎడిటర్ శ్రీరామ్ యాదవ్ మనవడి వేడుకకు తరలివచ్చిన బ్యూరోలు, ఎడిటర్లు



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణాజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండలమ్మ తల్లి ఆలయ సమీపంలో గురువారం సందడి నెలకొంది. వార్త ప్రభ దినపత్రిక ఎడిటర్ శ్రీరామ్ యాదవ్ మనవడి అన్న ప్రసన్న కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడింది.ముఖ్య అతిథులు మరియు ప్రముఖుల హాజరుఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులే కాకుండా, మీడియా రంగానికి



చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ పత్రికల ఎడిటర్లు, జిల్లా బ్యూరోలు మరియు పాత్రికేయ మిత్రులు విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించారు. శ్రీరామ్ యాదవ్ కుటుంబ సభ్యులు అతిథులకు సాదరంగా స్వాగతం పలికారు.కనువిందుగా వేడుకఅమ్మవారి ఆలయ సమీపంలోని వేదికపై జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా సాగింది. విందు వినోదాలతో పాటు, ఆత్మీయ పలకరింపుల మధ్య ఈ వేడుక ఒక పండగ వాతావరణాన్ని తలపించింది. శ్రీరామ్ యాదవ్ మనవడికి పలువురు ప్రముఖులు బహుమతులు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ, వృత్తిపరమైన బాధ్యతలతో బిజీగా ఉండే ఎడిటర్లు, బ్యూరోలు అందరూ ఇలాంటి శుభకార్యంలో ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

## టీడీపీ నేతలు మేయర్ పదవి కోసం పాకులాడుతున్నారు : గూడవల్లి నాగరాజు

మచిలీపట్నం /ప్రజాభూమి ప్రతినిధి



మేయర్ పదవి ద క్కించుకోవ డ ం కోసమే టీడీపీ నేతలు పోటీ పడి మరీ పేర్ని నాని, కిట్టుపై విమర్శలు చేస్తున్నారని వైకాపా నాయకులు గూడవల్లి నాగరాజు ధ్వజమెత్తారు. స్థా నిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పదవుల కోసం విమర్శలు పేర్ని నానిని, కిట్టుని ఎంత తిడితే అంత త్వరగా మేయర్ పదవి దక్కుతుందని కొందరు నేతలు భావిస్తున్నారని, ఆ క్రమంలోనే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.టీడీపీ మోసం - టిడ్కో ఇళ్లు 2019కి ముందు టిడ్కో ఇళ్ల పేరుతో టీడీపీ ప్రభుత్వం ప్రజలను నిలువునా ముంచింది. ఫ్లాట్లు కేటాయించినట్లు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపారని, కానీ క్షేత్రస్థాయిలోకి వెళ్తే అక్కడ ఇళ్లే లేని పరిస్థితి ఉందని గుర్తు చేశారు.వైఫల్యాలపై నిలదీత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా, ఒక్క అర్హుడికైనా కొత్తగా పెన్షన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. మాజీ నేతలు నడకుదిటి నరసింహారావు, ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్ర కేవలం దిష్టిబొమ్మల్లా మిగిలిపోయారని, ప్రజలకు వారి వల్ల ఎటువంటి ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు.ఈ ప్రెస్ మీట్‌లో టౌన్ పార్టీ అధ్యక్షులు మేకల సుబ్బన్నతో పాటు పలువురు వార్డు ఇన్చార్జిలు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధిని విస్మరించి కేవలం బురదజల్లే రాజకీయాలు చేస్తున్న టీడీపీ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని నాయకులు హెచ్చరించారు.

## 16 ఏళ్ల తర్వాత వైభవంగా కోర్లంకాలమ్మ జాతర

### గ్రామస్తుల భక్తిపారవశ్యం.. పాల్గొన్న కొల్లు రవీంద్ర



ప్రజాభూమి, మచిలీపట్నం రూరల్

సౌత్ మండలం పోలాటతిప్పు గ్రామంలో సుమారు 16 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత నిర్వహించిన శ్రీ కోర్లంకాలమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో రాష్ట్ర మంత్రివర్యులు మచిలీపట్నం శాసనసభ్యులు కొల్లు రవీంద్ర పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.గ్రామ సర్పంచ్ మోకా రాజు మరియు గ్రామ పెద్దలతో కలిసి ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఇన్నేళ్ల తర్వాత గ్రామంలో ఇంతటి ఘనమైన జాతర జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.చాలా కాలం తర్వాత గ్రామస్తులందరూ కలిసి ఇంత భక్తిశ్రద్ధలతో జాతర జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని కొల్లు రవీంద్ర తెలిపారు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాలతో ప్రజాసేవలో ముందంజ

- ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి - ఏలూరు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బడేటి చంటి తెలిపారు. పవర్ పేటలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ ప్రాంతాల ప్రజలు పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులను ఉచితంగా పొందారు.ఎమ్మెల్యే చంటి స్వయంగా శిబిరాన్ని పరిశీలించి, రోగులకు మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని సేవలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఏలూరులో ట్రాఫిక్ సమస్యకు సమతుల్య పరిష్కారం

: ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి - ఏలూరు



అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా, చిరు వ్యాపారులు సమస్యలు ఎదుర్కోకుండా సామరస్య విధానంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఆర్ఆర్‌పేట ట్రాక్‌రోడ్డు వద్ద మామిడి పండ్ల బండ్ల కారణంగా ట్రాఫిక్ సమస్యలు రావడంతో, ఎమ్మెల్యే స్వయంగా అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.వ్యాపారులు రోడ్డు మార్జిన్‌లోనే వ్యాపారం చేయాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు.వచ్చే సీజన్ నాటికి ఖాళీ ప్రదేశాల్లో వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐకి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా సమతుల్య నిర్ణయాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## మైక్రో ఫైనాన్స్ రుణాలకు దూరంగా ఉండాలి

### స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వ పథకాలే ఉత్తమ మార్గం



ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి

నెక్కలం గొల్లగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామైక్య సంఘం ఈసీ సమావేశంలో డిఆర్డిఏ ఏపీఎం దయాల రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద రుణాలు తీసుకోకూడదని సూచించారు. అధిక వడ్డీ, ప్రాసెసింగ్ ఛార్జీలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏసీఎల్పీ కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సిఐఎఫ్ వంటి పథకాల ద్వారా రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన రుణాల కోసం సంఘ సమావేశంలో నిర్ణయం తీసుకుని బయోమెట్రిక్ ద్వారా బ్యాంకులు లేదా స్త్రీనిధి నుంచి పొందవచ్చన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 1047 సంఘాలకు సుమారు రూ.75 కోట్లు రుణ అవసరాలు నమోదు అయినట్లు తెలిపారు. సమావేశంలో సిసి లక్ష్మి, వివోఏ విజయ, సంధ్య ప్రసన్న తో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో స్వర్ణ భారతి ప్రభంజనం

ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి



10వ తరగతి ఫలితాల్లో స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ధర్మవరం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కరెస్పాండెంట్ పేరి చర్ల రామకృష్ణ తెలిపారు. పోలిశెట్టి వర్షాంజలి (ధర్మవరం)596, బెల్లపుకొండ నయన వెంకట సత్యశ్రీ (పెనకనమెట్ట) 593, కట్టా వీర వెంకట సత్య నారాయణ (దొమ్మేరు)588, వేము లీలావైష్ణవి (పెద్దేవం)588 మార్కులు, నామన జస్వంత్ వెంకట సాయిరాం (పెద్దేవం)583, పోలిశెట్టి విజయ దుర్గ (ధర్మవరం)581 సాధించారు. మొత్తం 67 మంది విద్యార్థులకు గాను 550 పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 23 మంది కాగా 500 పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 48 మంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అందరిని స్కూల్ కరస్పాండెంట్ శ్రీ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపల్ శ్రీమతి పేరిచర్ల పద్మ , ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## టెన్త్ ఫలితాల్లో విద్యా రోహిణి విజయ కేతనం



ప్రజాభూమి - బుట్టాయిగూడెం.

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో బుట్టాయగూడెంకు చెందిన విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో గురువారం విడుదలైన టెన్త్ ఫలితాలలో మండల ప్రథమ స్థానం తమ పాఠశాలకు చెందిన తన్నీరు జాహ్నవి 587/600, ముష్టిన సలోమి మండల ద్వితీయ స్థానం584/600, షేక్ సుహాన581/600 మండల తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. సాయన దీప్తి580/600 మండల నాలుగో స్థానం సాధించినట్లు తెలిపారు. మొత్తం విద్యార్థులలో 15 మందికి మ్యాథమెటిక్స్ లో100/100, తెలుగులో 14 మందికి 100/100, సోషల్ లో నలుగురికి 100/100 మార్కులు వచ్చాయని వివరించారు. నలుగురు విద్యార్థులు 580 పైన, నలుగురు విద్యార్థులు 570 పైన ఆరుగురు విద్యార్థులు 560 పైన పదిమంది విద్యార్థులు 550 పైన 15 మంది విద్యార్థులు 500 పైన ఆరు మంది విద్యార్థులు సాధించి పదవ తరగతి ఫలితాల్లో మండలంలో అత్యధిక శాతాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఈ ఫలితాలు సాధించడానికి సహకరించిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు పాఠశాల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది కొండేపాటినీరజ, కొండేపాటి భరత్ సాయి తేజ, జి.కిషోర్, అశోక్ కుమార్, బి.గంగాభవాని, షేక్ షబానా, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా కాజులూరు ప్రభుత్వ పాఠశాల విజయభేరి

### కాజులూరు పాఠశాల ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు కైవసం







ప్రజాభూమి ప్రతినిధి - కాజులూరు

పదవ తరగతి ఫలితాలలో కాజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విజయ భేరి మోగించి ఔవురా అనిపించారు. ఈ మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కాజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణు మూర్తి తెలియజేశారు. పాఠశాలలోనే కాకుండా మండల స్థాయిలో కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో తమ పాఠశాల విద్యార్థులు నిలిచారని కొనియాడారు. 586 మార్కులతో గీసాల తేజ శ్రీ రమ్య ప్రథమ స్థానంలోనూ, 575 మార్కులతో బొల్లం సాయి వంశీ ద్వితీయ స్థానంలోనూ, 572 మార్కులతో యాళ్ళ లీలా హారిక తృతీయ స్థానంలోనూ నిలిచారని తెలిపారు. 153 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 93 శాతం ఉత్తీర్ణతతో 142 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇందులో 500 మార్కులు పైగా సాధించిన వారు 37 మంది ఉన్నారని గణితంలో ఇద్దరు సోషల్‌లో నలుగురు నూటికి నూరు మార్కులు సాధించారని తెలిపారు. ఫెయిల్ అయిన 11 మంది విద్యార్థులు అధైర్య పడకుండా మే 25 నుండి ప్రారంభమయ్యే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు బాగా ప్రిపేర్ అయ్యి ఉత్తీర్ణులు కావాలని ప్రధానోపాధ్యాయులు పిలుపునిచ్చారు. మండల స్థాయిలోనే అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి డేవిడ్, జాన్ లు పాఠశాల యాజమాన్య కమిటి చైర్మన్ పెంటపాటి పెద్దరాజు, విద్యాదాత అన్యం శ్రీరామ చంద్రమూర్తి, ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, సీనియర్ ఉపాధ్యాయులు భాస్కర సత్య ప్రసాద్, లక్ష్మీ కామేశ్వరి, రాజేశ్వరి, షేక్ వల్లీ భాషా తదితరులు అభినందించారు.

## వేసవికాలంలో విద్యుత్తు, మంచినీరు సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేయాలి

### మండల పరిషత్ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్



ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు

వేసవి కాలంలో విద్యుత్తు, మంచినీరు సరఫరాపై అధికారులు నిరంతర పర్యవేక్షణ అవసరమని ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చిట్టూరి కనక లక్ష్మి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ మాట్లాడారు. ఈ రెండు నెలలు అధికారులు ఫోనులు స్విచ్ ఆఫ్ చేయకుండా కష్టపడి పనిచేయాలని కోరారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ఎల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో 75 ట్రాన్స్ఫార్మర్లు మండలంలో ఏర్పాటు అత్యధికముగా చేశామని చెప్పారు. ఎక్కడ లో వోల్టేజ్ సమస్య లేకుండా చూస్తున్నామని తెలిపారు. తాసిల్దార్ వై డి కిషోర్ మాట్లాడుతూ మే ఒకటి నుంచి ఇంటి గణాంకాలు లెక్కిస్తారని సిబ్బందికి 34 రకాల ప్రశ్నలు సమాధానం చెప్పాల్సి ఉందని తెలిపారు. ధాన్యం ట్రక్ సీట్లు మూడు గంటల లోపు ఇస్తే 24 గంటల్లో వారి ఖాతాల్లో సొమ్ము జామవుతాయని తెలిపారు. డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీడీవో ఎన్ ఎన్ ఉమామహేశ్వరరావు, ఏవో రామదాసు నాయుడు, సునీల్ కుమార్,శాగ సత్యనారాయణ,ఈవోపీఆర్డి టీం మూర్తి బాబు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఎంఈఓ లు శర్మ, వీరస్వామి, ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ వివి రమణ, ఏవో రాజశేఖర్, ఏ ఈ సూర్య కుమార్, శ్యాం బాబు, అజురిద్దీన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కాగా సమావేశానికి అతి తక్కువ సంఖ్యలో ఎంపీటీసీ సభ్యులు హాజరు కాగా, మండలంలోని గ్రామాలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల అధికారులు మాత్రం హాజరయ్యారు.

## యెహోని ఆర్ఐఓగా తొలగించాలి

- పిడిఎస్యు నగర కమిటీ ఆందోళన.
- జిల్లా కలెక్టర్ కి వినపత్రం.





ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా.

ప్రైవేట్ కార్పొరేటీ కళాశాల ఆగడాలను అరికట్టడంలో, విధులలో ఆలసత్వం వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కే. యోహాను ( ఆర్. ఐ. ఓ) పోస్ట్ నుంచి తొలగించాలని కోరుతూ పి.డి.ఎస్.యు నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. అనంతరం కలెక్టర్కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు వారు ఈనెల 24వ తేదీ నుంచి సమ్మర్ హాలిడేస్ ప్రకటించిశ్రీ వారిని కచ్చితంగా అమలు చేయాలని కింది స్థాయి ఇంటర్నెట్ బోర్డ్ అధికారులకి తెలియజే శారని నాని అన్నారు. అయితే ఆ యొక్క ఆదే శాలను అమలుచేయ్యటం లో ఏలూరు జిల్లా ఆర్.ఐ. ఓ కే. యోహాను విఫలమయ్యారని నాని తెలియజేశారు. సెలవులు ప్రకటించి వారం రోజులు కావస్తున్నప్పటికీ నేటికీ జిల్లాలో అక్కడక్కడ ప్రైవేట్ కార్పొరేట్ కళాశా లలో క్లాసులు నిర్వహిస్తున్న సమాచారం ఆర్.ఐ.ఓకి తెలియజేసిన ఎటువంటి స్పందన లేదని నాని ఆరోపించారు. అదేవిధంగా 27వ తేదీన ధర్మాజీ గూడెంలో గల శ్రీ ప్రతిభ మహిళా జూనియర్ కళాశాలలో అనుమతి లేకుండా ఎంసెట్ క్లాసులు నిర్వహిస్తున్నారు అన్న సమాచారంతో పి.డి.ఎస్. యు విద్యార్థి సంఘం గా వెళ్లి అడ్డుకోగా అక్కడ మగ విద్యార్థులు కూడా ఉండడం గమనించి వెంటనే ఆర్.ఐ. ఓ దగ్గరికి వచ్చి కంప్లైంట్ చేసినప్పటికీ కూడా యాజమాన్యం క్లాసులు ఆపకుండా తర్వాత రోజు కూడా క్లాసులు నిర్వహించిందని ఇదే విషయాన్ని యోహాను దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కూడా ఆయన ఎక్కడ స్పందించలేదని నాని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో చాలా ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో బెటర్మెంట్, సప్లమెంటరీ కట్ట తలుచుకున్న విద్యార్థుల నుంచి బోర్డు విధించిన రుసుము 600o180 కంటే అదనంగా ఫీజు లు చాలా యాజమాన్యాల కట్టించుకున్నప్పటికీ మరియు బుక్స్ పేరుతో యూనిఫామ్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న ఆయనెక్కడ పర్యవేక్షణ చేయలేదని నాని తెలిపారు. ఇది విధి నిర్వహణలో అలసత్వం కాదా అని నాని అధికారులను ప్రశ్నించారు. కాబట్టి పబ్లిక్ సర్వెంట్ గా ఉండవలసినటువంటి ఒక జిల్లా అధికారికి విద్యార్థులకు సంబంధించిన అంశాల మీద కంప్లైంట్ ఇస్తే వాటి మీద చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని నాని ప్రశ్నించారు. కావున విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నటువంటి కే యోహానుని ఆర్.ఐ.ఓ పోస్ట్ నుంచి తొలగించాలని అధికారుల డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని నాని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నగరప్రధాన కార్యదర్శి ఎస్ సునీల్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ చరణ్. చింతలపూడి నగర కార్యదర్శి ఎండి రయాన్. బాలు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో 80.83 శాతం సాధించిన ఐటీడీఏ పాఠశాలలు







ప్రజాభూమి - బుట్టాయగూడెం

ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో కోట రామచంద్రపురం ఐటీడీఏ పాఠశాలలు 80.83% ఉత్తీర్ణత సాధించినట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం విడుదలైన పది ఫలితాలపై సమీక్షించిన పిఓ రాములు నాయక్ మాట్లాడుతూ కె ఆర్ పురం ఐటీడీఏ పరిధిలో ఆశ్రమ పాఠశాలల నుండి మొత్తం 678 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 548 మంది ఉత్తీర్ణత సాధించి 80.83% ఉత్తీర్ణత పొందినట్లు చెప్పారు. పోలవరం మండలం ఇటుకులకోట ఆశ్రమ పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించి ప్రత్యేక ప్రతిభ కనబరిచినట్టు పేర్కొన్నారు . ఈ పాఠశాలను గతంలో జిల్లా కలెక్టర్ సందర్శించి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన విషయం ఈ సందర్భంగా ప్రస్తావించారు. గురుకుల పాఠశాలలు 79% ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఐటీడీఏ స్థాయిలో బల్ల అక్షయ (ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, రాజానగరం) 561 మార్కులతో మొదటి స్థానం సాధించగా, రెండవ స్థానం 560 మార్కులతో తెల్లం హర్షిత (శివకాశీపురం), మూడవ స్థానం 559 మార్కులతో చోడెం ఊహ తేజశ్రీ (ఆశ్రమ ఉన్నత పాఠశాల, తెల్లం వారి గూడెం) సొంతం చేసుకున్నట్లు తెలిపారు. బాలుర ఉత్తీర్ణత శాతం 74.51 శాతం కాగా, బాలికలు 84.63% ఉత్తీర్ణత సాధించి ముందంజలో నిలిచారని చెప్పారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 33 మంది ఉన్నారని, గురుకుల పాఠశాలలలో 207 మంది పరీక్షలు రాయగా, 151 మంది ఉత్తీర్ణత సాధించి 72.95% ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జగన్నాధరావు, ఉప విద్యాశాఖాధికారి రవి ప్రసన్న కుమార్, ఏ ఎం ఓ సిరమయ్య , జి సి డి వో రాజేశ్వరి పాల్గొన్నారు.

## ఒకేసారి పదో తరగతి పరీక్షలు రాసి తల్లి కొడుకులు ఉత్తీర్ణత



ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు

ఒకేసారి పదో తరగతి పరీక్షలు రాసి తల్లి కొడుకులు రాసి ఉత్తీర్ణులయ్యారు. వివరాలు ఇలా వున్నాయి.పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రత్యేకత సంతరించుకొని.. తీవ్ర స్థాయిలోవైరల్ గా మారిన ఈ అరుదైన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో జరిగింది. పాలకొల్లుకు చెందిన బండారు లక్ష్మీ లహరి, (అశ్విని ముత్యాల), తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం లోని బొజ్జా జయశ్రీ గర్ల్స్ హైస్కూల్లో ఇటీవల పదవ తరగతి పరీక్షలు రాయగా.. ఆమె కుమారుడైన విజయ్ పాలకొల్లు మండలం పూలపల్లి లోని శ్రీ చైతన్య స్కూల్లో పదో తరగతి చదువుతూ.. పాలకొల్లు భాష్యం స్కూల్లో పదవ తరగతి పరీక్షలు రాశారు. ఒకే సమయంలో వేరు వేరు చోట్ల తల్లి కొడుకులు పరీక్షలు రాశారు. అయితే ఈరోజు విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాలలో తల్లి కొడుకులు ఒకేసారి ఉత్తీర్ణత సాధించి భేష్ అనిపించుకున్నారు. తల్లి కొడుకులు పదో తరగతిలో ఒకేసారి పాస్ కావడంతో ఈ విషయం సర్వత్రా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అంశం సోషల్ మీడియాలో తీవ్ర చర్చినియాంసమైంది. ప్రత్యేక ఆకర్షణ నిలిచింది కూడా. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కుమారుడు 562/600 మార్కులతో ఉత్తీర్ణుడు కాగా, తల్లి లక్ష్మీ లహరి 360/500 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలలో గాయత్రి మండల ఫస్ట్

### ఏం ఈ ఓ డి సుబ్బారావు



ప్రజా భూమి ప్రతినిధి - కామవరపుకోట

కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గాయత్రి మండల ఫస్ట్ సాధించి నట్లు మండల విద్యాశాఖ అధికారి డి సుబ్బారావు చెప్పారు. ఈరోజు విడుదలైనటువంటి పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కామవరపుకోట మండలంలో 85% ఉత్తీర్ణత సాధించారు మొత్తం 705 మంది విద్యార్థులు పరీక్ష హజరు కాగా 598 మంది పాసైనారు. ప్రభుత్వ పాఠశాల నుండి 391 మంది విద్యార్థులు హాజరు కాగా 287 మంది పాసైనారు( 73%) ప్రైవేట్ పాఠశాల నుండి 314 మంది విద్యార్థులు హాజరు కాగా 311 మందితో 99 శాతం సాధించారు, ప్రభుత్వ పాఠశాలల్లో కామవరపుకోటకు చెందిన సిహెచ్ గాయత్రి అనే విద్యార్థి 580 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానం పొందింది అదే స్కూల్ నుండి బి శాంతకుమారి 578 మార్కులతో ద్వితీయ స్థానం, జి లహరిత 576 మార్కులతో తృతీయ స్థానం ప్రభుత్వ స్కూల్ నుంచి సాధించడం మండలంలో ఈ విధమైన ఫలితాలు రావడానికి సహకరించినటువంటి అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు ఉపాధ్యాయులకు అలాగే ఉత్తీర్ణత సాధించినటువంటి విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. కామవరపుకోట మండలం రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈరోజు విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు తెలిపారు. మొహమ్మద్ షాకీర్ షేక్ 547 మార్కులతో ప్రథమ స్థానం, మీనాక్షి 534 ద్వితీయ స్థానం, దొప్పసాని బాలజ్యోతి 526 మార్కులతో తృతీయ స్థానం వనమా మనోహ 520, వేముల లక్ష్మీ ప్రణతి 518 మార్కులు సాధించారన్నారు.

## జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్కు పదవీ విరమణ సందర్భంగా ఘన వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా

జిల్లా పరిషత్ కార్యాలయం జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఇ వి హరికృష్ణ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ, హరికృష్ణ తమ సేవా కాలమంతా క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి జిల్లా పరిషత్‌కు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, జూనియర్ సిబ్బందికి మార్గనిర్దేశనం చేసిన ఆయన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ జిల్లా పరిషత్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్రీ శ్రీ జయంతి.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం శ్రీశ్రీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపల్ శ్రీ శ్రీ సాహిత్యం సమాజాన్ని మేలుకొల్పే ఒక విప్లవ ఆయుధంగా పేర్కొన్నారు. విద్యార్థులు శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి కవితల్ని చదివి వాటిని విశ్లేషణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు హిందీ విభాగాధిపతి డాక్టర్ ఎన్వి. రమణ , ఎకనామిక్స్ అధ్యాపకులు బి .రవికుమార్ , డాక్టర్ ఎన్.సుజాత, డాక్టర్ కే .శ్రీదేవి విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థుల విజయానికి మంత్రి కందుల దుర్గేష్ సలాం

- పదో తరగతి ఫలితాల్లో నిడదవోలు విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం.
- నిడదవోలు విద్యార్థుల విజయం నియోజకవర్గానికి గర్వకారణం అంటూ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసలు



ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నిడదవోలు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్, ఇతర పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరచడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన మార్కులు వారి కష్టానికి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ మన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి విజయానికి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు మంత్రి దుర్గేష్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన విద్యాశాఖ అధికారులు మరియు ఉపాధ్యాయుల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులందరూ ఇదే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. "చదువే సంపద అని నమ్మి, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు నిడదవోలు నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చారు. రాబోయే రోజుల్లో వీరికి ప్రభుత్వం తరపున మంచి ప్రోత్సాహం ఉంటుంది" అని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేక పోయిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరింత బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతంపై సంతోషం వ్యక్తం చేశారు.

## ద్వారకాతిరుమల పాలకమండలి సభ్యులుగా గడ్డమడుగు రవికుమార్



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ద్వారకాతిరుమల (చిన్న తిరపతి) పాలకమండలి సభ్యులుగా జనసేన జిల్లా అధికార ప్రతినిధి గడ్డమడుగుల రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు.ద్వారకాతిరుమల పాలక మండల కమిటీ ప్రమాణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ఆలయ చైర్మన్ సుధాకర్ రావు జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కూటికలపూడి గోవిందరావు రాష్ట్ర మత్స్యకార చైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి జనసేన సీనియర్ లీడర్ గడ్డ మనుగు రవికుమార్ వారి ప్రమాణ స్వీకారం పుష్ప గుచ్చములతో సత్కరించారు.రవికుమార్ ఎన్డీఏ మార్పు ద్వారకా తిరుమల లో భక్తుల సౌకర్యార్థం అన్ని విధాల శ్రద్ధ తీసుకుంటామని అందరికీ అందుబాటులో ఉంటామని నన్ను జనసేన పార్టీ నుంచి నన్ను నియమించిన పవన్ కళ్యాణ్ కి నాదెండ్ల మనోహర్ కి జిల్లా అధ్యక్షులు గోవిందరావు కి ఎంపీ పుట్ట మహేష్ కి ఎమ్మెల్యే చెర్రీ బాలరాజు కి జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి కి,సువర్ణ రాజు కి నాకీ పదవి రావటానికి ప్రతి ఒక్క జనసేన నాయకులకు పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# నింగికేగిన ఉద్యమ కెరటం - మూగబోయిన దళిత వాయిస్

- అంబేద్కర్ మృతి పార్టీకి తీరని లోటు - ఎమ్మెల్యే బండారు.
- పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించిన కొత్తపేట ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

అనాగరిని వర్గాల పోరాట యోధుడు, దళిత కులాల హక్కుల కోసం అవిశ్రాంతంగా శ్రమించిన దళిత ఉద్యమనేత, ప్రముఖ అంబేద్కర్ వాది, సీనియర్ రాజకీయ నాయకుడు, కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం ఎస్సీ సెల్ అధ్యక్షులు కోనాల అంబేద్కర్ మృతి పార్టీకి తీరని లోటని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు. కోనాల అంబేద్కర్ మృతి చెందడంతో రావులపాలెం లోని ఆయన స్వగృహం వద్ద కోనాల అంబేద్కర్ పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి, పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కోనాల ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన మృతితో బలమైన నాయకుడ్ని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అంతిమ యాత్రలో జిల్లా నలుమూలల నుండి అంబేద్కర్ వాదులు, పార్టీ నాయకులు పాల్గొని వీడ్కోలు పలికారు

## వీరవరపుపేట కమ్యూనిటీ భవనానికి 50 లక్షలు మంజూరు చేయండి

-మంత్రికి యనమల దివ్య వినతి...



ప్రజాభూమి ప్రతినిధి-తుని

తుని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి నిధులు రాబట్టడమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ యనమల దివ్య తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఇవాళ ఆమె రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు పెండింగ్ పను లపై వారితో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా తుని పట్టణంలోని వీరవరపుపేటలో స్థాని క ప్రజల సామాజిక అవసరాల నిమిత్తం నూతనంగా కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాల్సిన ఆవ శ్యకతను మంత్రికి వివరించారు. ఈ భవన నిర్మాణ పనుల కోసం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు అభ్యర్థనతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చినట్లు క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో ప్రస్తుత రబీ లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేస్తున్నామని, 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి గాను ఇంత వరకు 1,54,386 టన్నుల ధాన్యాన్ని సేకరించామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ చెప్పారు. ధాన్యం సేకరణకు గాను 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని, ఇంతవరకు 103 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1,54,386 టన్నుల ధాన్యాన్ని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేకరించామన్నారు. 58 లక్షల గొనె సంచులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఉంగుటూరు మండలం లో 53,485 మెట్రిక్ టన్నుల ధాన్యమును, నారాయణపురం 2 కొనుగోలు కేంద్రాల ద్వారా 3745 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఉంగుటూరు మండలంలో 157 వాహనాలను రిజిస్ట్రేషన్ చేసి మరియు 16,93,747 గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతుల యొక్క ధాన్యమును బద్రపరుచుటకు 325 టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించేందుకు



జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద రైతుల కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. హమాలీలు, వాహనాలను, గోనె సంచులు కూడా రైతులు వారి సొంతం గా ఏర్పాటు చేసుకున్నట్లైతే గోనె సంచుల కోసం వినియోగ రుసుము 4.47/- హమాలీల కొరకు 24.06 వాహనాల ఏర్పాటు కొరకు ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి వాహనాలు, గోనె సంచులు, వంటి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉన్నచో టోల్ ఫ్రీ 18004256453 నెంబర్ కి లేదా హెల్ప్ డెస్క్ నెంబర్ -7702003584. నంబర్లకు ఫిర్యాదు చేసినచో వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని మూర్తి తెలియజేసారు.

## పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ



ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి, నేడు పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారిలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై కె. సత్యనారాయణ, ఇంద్రపాలెం ఎస్సై జి.వి.బి.వి. ప్రసాద్ మరియు కాకినాడ ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ ఎస్సై వి.జె. మోహన్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా అధికారులను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి, వారి సుదీర్ఘ సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన నిబద్ధతను అభినందిస్తూ, వారి తదుపరి విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఎస్పీ సీసీ కె. రాంబాబు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సత్యమూర్తి, ఆర్.ఐలు ఎం. నరసింహమూర్తి, కె. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పదో తరగతి ఫలితాలు విడుదల - 63% ఉత్తీర్ణత



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

మండల విద్యాశాఖాధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2025-26 విద్యా సంవత్సరపు పదో తరగతి ఫలితాల్లో ఆగిరిపల్లి మండలానికి 63% ఉత్తీర్ణత నమోదు అయింది. మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల నుంచి 391 మంది పరీక్షలు రాయగా 246 మంది ఉత్తీర్ణులు అయ్యారు. పాఠశాలల వారీగా బొద్దనపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల 86%తో ముందంజలో ఉండగా, ఎం. సూరవరం జెడ్పీహెచ్ఎస్ 72%, ఈదులగూడెం 67%, ఈదర 60%, ఆగిరిపల్లి 59%, అడవినెక్కలం 48% ఉత్తీర్ణత సాధించాయి. ఎం. సూరవరం పాఠశాల విద్యార్థినులు మాకుల శివ రాజ్య లక్ష్మీ (583)( నూజివీడు డివిజనల్ స్థాయిలో కూడా ప్రథమ స్థానం పొందింది) మరియు గిడుతూరి నమ్రతా రోస్ (582) మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, నజియా పర్వీణ్ (564) తృతీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలను మండల విద్యాధికారులు ఎస్ హేబేలు, ఆనంద కుమార్ మరియు ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు అభినందించారు.

### అన్నవరం క్షేత్రంలో కన్నుల పండువగా

# శ్రీ సత్యదేవుని రథోత్సవం

## భక్తజన సంద్రమైన రత్నగిరి దిగువ వీధులు

ప్రజా భూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం రత్నగిరిపై వేంచేసి ఉన్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం, ఐదవ రోజు నిర్వహించే శ్రీ సత్యదేవుని రథోత్సవం బుధవారం నాడు కొండ దిగువన అత్యంత వేడుకగా జరిగింది. స్వామి వారు అమ్మవార్లతో కలిసి రథంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు.

**అంగరంగ వైభవంగా రథయాత్ర ప్రారంభం**

సర్వాంగ సుందరంగా, రకరకాల పుష్పమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై శ్రీ సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీ దేవి అమ్మవార్లను ఆశీనులను చేశారు. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం, వేద మంత్రోచ్చారణల మధ్య రథయాత్ర ప్రారంభమైంది. తొలుత పావంచాల వద్ద నుండి ఈ యాత్ర మొదలై గ్రామ పురవీధుల గుండా సాగింది. దేవస్థానం అధికారులు, ఆలయ ఈవో చక్రధరరావు, చైర్మన్ రోహిత్ తదితరులు రథం తాడును పట్టుకుని యాత్రను ప్రారంభించారు.

**భక్తజన కోలాహలం - సాంస్కృతిక ప్రదర్శనలు**

ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు అన్నవరం



పరిసర ప్రాంతాల నుండే కాక, రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు.రథం ముందు కేరళ డప్పు వాయిద్యాలు, కోలాటాలు, వివిధ రకాల పురాణ వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా కాళికా దేవి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రథం కదులుతుంటే భక్తులు 'గోవిందా.. గోవిందా..' అనే నామస్మరణతో ఆ ప్రాంతాన్ని మారుమోగించారు. ఇంటింటికీ స్వామి వారికి హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి తమ భక్తిని చాటుకున్నారు.

**రథోత్సవ విశిష్టత**

పురాణాల ప్రకారం, రథంపై ఉన్న దేవుడిని దర్శించుకోవడం వల్ల పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం. కల్యాణం జరిగిన తర్వాత స్వామి వారు తన దేవేరితో కలిసి అత్తవారింటికి రథంపై వెళ్తున్న దృశ్యాన్ని భక్తులు కళ్ళకు హత్తుకున్నట్లు దర్శించుకున్నారు. రథాన్ని లాగడం వల్ల పాపాలు తొలగిపోతాయని భావించి, భక్తులు రథం తాడును పట్టుకోవడానికి పోటీ పడ్డారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు మరియు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు . భక్తుల కోసం చల్లటి మజ్జిగ, తాగునీరు మరియు ఐస్ క్రీం పంపిణీ చేశారు.భారీగా తరలివచ్చిన భక్తుల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రథం సాగే దారిలో ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.మొత్తానికి శ్రీ సత్యదేవుని రథోత్సవం భక్తిభావంతో, ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా ముగిసింది.

### టెన్త్ పరీక్షల్లో

## పెదపాడు హై స్కూల్ మండలం ఫస్ట్

-హెచ్ఎం పి వెంకటేశ్వరరావు

ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పెదపాడు శ్రీ కాకరాల చంద్రశేఖర రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రజాపతి .కిరణ్ కుమార్ 600 కి 573 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం పొందాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి వెంకటేశ్వరరావు తెలిపారు.ఎస్ ఎస్ సి పరీక్ష ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది.ఈ పరీక్షల్లో తమ పాఠశాల నుంచిమొత్తం 117 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 89 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. 28 మంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన 117 మంది విద్యార్థులలో 16 మంది విద్యార్థులు 600 కి 500 కు పైగా మార్కులు సాధించారని ఆయన తెలిపారు. వీరిలో ప్రజాపతి కిరణ్ 573 మార్కులు, పీస్ స్టీవెన్ పాల్ 565 మార్కులు, వి రంజిత రమణి 558 మార్కులు సాధించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని ఆయన తెలిపారు.టెన్త్ పరీక్షలు పాసై విద్యలో తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# జలధార-జలహారతి పనులు నాణ్యతతో వేగవంతం చేయాలి

- ఉపాధి హామీ పనులు దీర్ఘకాల ప్రయోజనాలకు దోహదం చేయాలి
- కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు మండలం పల్లెర్లమోడీ, యంయన్ పాలెం, తుక్కులూరు తదితర గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న జలధార-జలహారతి పనులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గురువారం అకస్మికంగా తనిఖీ చేసి, వర్షపు నీటి ప్రతి చుక్కను సంరక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో రూ.150 కోట్లతో పనులు చేపట్టగా, నూజివీడు మండలంలో 302 పనులకు రూ.12 కోట్లు కేటాయించామని పేర్కొంటూ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, ఫీడర్ ఛానళ్ల శుభ్రపరిచే పనులు వేగవంతం చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని, అవసరమైతే యంత్రాల వినియోగంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం



లేదా నాణ్యత లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, డ్వామా పీడీ కె. వెంకట సుబ్బారావు, ఇరిగేషన్ డీఈ అర్జున్ రావు, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, స్థానిక రైతులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శుక్రవారం 01 మే 2026


## నూతన న్యాయస్థాన భవన సముదాయాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి -త్వరలో ప్రారంభానికి చర్యలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురంకు ఇటీవల నూతనంగా రెండవ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం మంజూరయింది. దీంతో ఆ న్యాయస్థానం నిర్వహణ కోసం స్థానిక పశుసంవర్ధక శాఖ స్వాధీనంలో నిర్వహిస్తున్న న్యాయస్థానాల సముదాయంలోని మూడవ అంతస్తులో ఏర్పాటు చేసిన రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన భవన సముదాయాన్ని గురువారం జిల్లా న్యాయమూర్తి భీమారావు పరిశీలించారు. స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి సంబంధిత న్యాయస్థానం సముదాయాన్ని జిల్లా న్యాయమూర్తి పరిశీలించి పలు సూచనలు చేశారు. తొలుత బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తికి బొకే అందజేసి సన్మానించారు. నూతన న్యాయస్థానం భవన సముదాయాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి అవసరమైన ఫర్నిచర్, ఫ్యాన్లు తదితర వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం న్యాయమూర్తుల చాంబర్లు, రికార్డు గది తదితర వాటిని పరిశీలించి సూచనలు చేశారు. నూతన న్యాయస్థాన న్యాయమూర్తి ఛాంబర్, ప్రత్యేక న్యాయస్థానం కార్యాలయ నిర్వహణ తదితర వాటి నిర్వహణపై జిల్లా న్యాయమూర్తి పలు మార్పులు చేయాలని. కాగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రత్యేక న్యాయస్థానంలో వేసవి కారణంగా ఎయిర్ కండిషన్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు న్యాయవాదులు జిల్లా న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఏసీల మంజూరు కోసం ఉన్నత న్యాయస్థానంకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. నూతన న్యాయస్థానం భవన సముదాయం ప్రారంభానికి సిద్ధంగా ఉండాలని న్యాయమూర్తి బార్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెండవ తరగతి మెజిస్ట్రేట్ రమాదేవి తోపాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యాన్ని సామాన్యులకు చేరువ చేసిన మహాకవి శ్రీ శ్రీ

### -ఘనంగా నివాళులర్పించిన రచయితలు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

తెలుగు సాహిత్యాన్ని తన పదునైన కవిత్వంతో ప్రభుత్వాలను మేల్కొల్పడంతో పాటు సామాన్యులకు అర్థమయ్యే విధంగా అందుబాటులోకి తెచ్చిన గొప్ప కవి శ్రీశ్రీ అంటూ వక్తలు కొనియాడారు. మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న తపన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితలు శ్రీ శ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కవులు మాట్లాడుతూ, ఛందస్సు బంధాలతో, సంస్కృత సమాసాలతో నిండి ఉన్న తెలుగు సాహిత్యాన్ని సామాన్యుల వద్దకు చేర్చిన నవయుగ స్వాప్నికుడు, అభ్యుదయవాది శ్రీరంగం శ్రీనివాసరావుగా పేర్కొన్నారు. సాహిత్యం పండితుల సొత్తు కాదని, ప్రతి సామాన్యుడికి సాహిత్యం చేరువ చేయడానికి శ్రమించిన శ్రామికుడు శ్రీ శ్రీ అన్నారు. కవిత్వం శ్రామిక వర్గపు కష్టాలను ప్రతిబింబించాలని, కర్షకుల చెమట నీటికి విలువ కట్టాలని, కవిత్వాన్ని జన సామాన్యులకు చేరువ చేసిన గొప్ప కవి శ్రీశ్రీ అంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రముఖ మాండలిక సడ్లపల్లె చిదంబర రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షులు సిద్ధగిరి శ్రీనివాస్, విశ్రాంత ప్రిన్సిపాల్ చింతా గంగిరెడ్డి, కవి ఎంసి గంగాధర్, ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం , సుదర్శనరెడ్డి సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

## గార్డు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేయడానికి ఈ కూలర్లు ఉపయుక్తంగా ఉంటాయి

**పోలీస్ గార్డ్ విధుల్లో ఉన్న సిబ్బంది సౌకర్యార్థం రూ. 2 లక్షల విలువ చేసే 15 ఏయిర్ కూలర్లు అందజేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



జిల్లా ఎస్పీ పి. జగదీష్ గురువారం జిల్లా గార్డు విధుల్లో ఉంటున్న పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి తీవ్రత, ఉక్కుపోతలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమైన అధికారుల కార్యాలయాల వద్ద విధులు నిర్వహిస్తున్న గార్డ్స్ కు సౌకర్యం కల్పించే ఉద్దేశంతో రూ. 2 లక్షల విలువ చేసే 15 ఏయిర్ కూలర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ఎండ తీవ్రత, ఉక్కుపోతల్లో కూడా నిరంతరం విధులు నిర్వర్తిస్తున్న గార్డ్ పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. గార్డులు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేయడానికి ఈ కూలర్లు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐలు మధు, పవన్ కుమార్, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఫెయిల్ కావడంతో మనస్థాపంతో విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పదవ తరగతి పరీక్షల ఫలితాల సమయంలో విద్యార్థులు తీవ్ర మనస్థాపానికి గురై క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. ఇలాంటి సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం కిరికెర గ్రామంలో చోటుచే సుకుంది. గురువారం 10వ తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కాగా మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు గుర్తించిన విద్యార్థిని హంసశ్రీ (15) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. దీంతో ఆ కుటుంబంతో పాటు ఆ గ్రామంలోని తీవ్ర విషాద ఛాయలు కమ్ముకున్నాయి. వివరాల మేరకు రూరల్ మండల పరిధిలోని కే.బసవన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మూర్తిల తమ్ముడి కుమార్తె హంసశ్రీ చదువుతోంది. చదువులో బాగున్నప్పటికీ ఫలితాలు తారుమారుకావడంతో ఆ విద్యార్థి నితీవ్ర మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై అప్ గ్రేడ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కన్నీరు, మున్నీరుగా కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కలిచి వేశాయి.

## పది ఫలితాల్లో పాంచజన్య విద్యార్థుల ప్రతిభ


Sarah ( Marks: 585)


N Chetan ( Marks: 583)


Sannidhi (Marks: 583


K Harshitha ( Marks: 575)

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని పాంచజన్య పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం కన్నా ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన పది ఫలితాలలో పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. పది ఫలితాలపై ఆయన మాట్లాడుతూ, పాఠశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు మా విద్యార్థులు మంచి ఫలితాలు విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం విడుదలైన ఫలితాలలో 95 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు చైతన్య- 586, సారా - 585, చేతన్ -583, 3- 583. - 575, 5- 574, 55 - 574, 2- 573, - 572, -576 మార్కులు సాధించారు. పాఠశాలలో 70 మందికి పైగా విద్యార్థులు 500 మార్కులకు పైగా సాదించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార లకు అధ్యక్షులు శ్రీనివాసులు, సెక్రటరీ నందకుమార్, ప్రిన్సిపాల్ గాయిత్రి, ఎఓ భాస్కర్, పాఠశాల సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ యంలు షేక్ అబ్దుల్ రజాక్, సతీష్, శశికళతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.


K Chethan (Marks:574)


Gowri Shankar (Marks: 574)

## యువతలో ఆవిష్కరణాత్మక దృక్పథం పెంపొందించడం సమాజ అభివృద్ధికి, దేశానికి కీలకం

**- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో "ఫ్యూచర్ ఫౌండర్స్ 2.0"కార్యక్రమాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్..**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

నగరంలోని జేఎన్టీయూలో ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అనంతపురం స్పోక్ ఆధ్వర్యంలో "ఫ్యూచర్ ఫౌండర్స్ 2.0" పేరుతో 45 రోజుల ప్రీ-ఇంక్యుబేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఆవిష్కరణాత్మక దృక్పథం పెంపొందించడం సమాజ అభివృద్ధికి, దేశానికి కీలకమని పేర్కొన్నారు. దేశంలోని 90 శాతం కంపెనీలు ఒకప్పుడు చిన్నగా తమ ప్రయాణాన్ని ఎలా మొదలు పెట్టారో ఈరోజు మీరు కూడా అలా సహనం కోల్పోకుండా కష్టపడాలని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యకలాపాల మాసపత్రికతో పాటు జూన్‌లో నిర్వహించబోయే "డిఫెన్స్ హకతాన్ 2ఖ26" పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఈఓ డా.ఆర్.హాఫీజ్ బాషా మాట్లాడుతూ "ఫ్యూచర్ ఫౌండర్స్ 2.0" ద్వారా యువతకు మెంటారింగ్, మార్గదర్శకత, నెట్‌వర్కింగ్ అవకాశాలు కల్పిస్తూ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమ రోడ్‌మ్యాప్‌ను వివరించి, ఎంపికైన అభ్యర్థులకు ఆన్‌బోర్డింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువ వ్యాపార ఆశావహులు పాల్గొని స్టార్టప్స్, ఆవిష్కరణలు, ఫండింగ్ అవకాశాలపై నిపుణులతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువత తమ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చే వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా డిఆర్డిఓలోని ఆర్.సీ.ఐ నుండి రిటైర్డ్ డైరెక్టర్ డా.సుధీర్ కుమార్ చౌదరి, భారత నావికాదళం మాజీ కమాండర్ వైవివి ప్రసాద్ పాల్గొని యువతకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు.అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పప్రొ.ఎస్బి.కివాడే, జేఎన్టీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొ.వి.శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ / మేకర్ స్పేస్ భారత్ ఫోర్జ్ కంపెనీ సహకారంతో స్థాపన దిశగా నిపుణుల కమిటీ సభ్యులు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను సందర్శించి అవసరమైన సదుపాయాలపై సవివరంగా చర్చించారు.




## వచ్చిరాని వైద్యంతో అనర్థాలు తేవొద్దు -జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జయం పద్మజ




ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆర్ఎంపీలు రోగులకు ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలని యాంటిబయోటిక్స్, స్టెరోయిడ్స్ లాంటి మందులు అనవసరంగా ఇవ్వరాదని జిల్లా నోడల్ అధికారిణి డాక్టర్ జయం పద్మజ పేర్కొన్నారు. స్థానిక అల్ హిలాల్ సమావేశ మందిరంలో గురువారం ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేరుకు ముందు ఆర్ఎంపీలు డాక్టర్ అని పెట్టుకోకూడదని సూచించారు. అత్యవసర సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులు, ఇతర అర్హతా ప్రమాణం కలిగిన అస్పత్రులకు వెళ్లే విధంగా బాధితులకు సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లాలో గతంలో జరిగిన సంఘటన లాంటివి తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. " క్లినిక్ "అని, "చిన్నపిల్లలకు ప్రత్యేకంగా చూడబడును" అను బోర్డులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు అని మాత్రమే బోర్డులుండాలన్నారు. ప్రథమ చికిత్సకేంద్రాల్లో బెడ్లు, సెలెయిన్ బాటిల్స్ తోబాటు స్టాండ్లు, బెడ్లు, మంచాలు వుండకూడదన్నారు. ప్రసవాలు, అబార్షన్లు చేయకూడదని స్పష్టం చేశారు. ల్యాబ్ పరీక్షలు నిర్వహించకూడదని తెలిపారు. వచ్చిరాని వైద్యంతో ఏవైన అనర్థాలకుకారకులైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు జయంత్, కిరణ్మయి రెడ్డి, మిజ్బ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి మాత్రమే ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు అందించాలన్నారు. ఆర్ఎంపీలు చేయదగిన, చేయకూడని సేవలు గురించి విపులంగా వివరించారు. ఇందులో భాగంగా పలువురు ఆర్ఎంపీలు అడిగిన పలు ప్రశ్నలకు అవగాహన కల్పించారు. ఆర్ఎంపీల సంఘం ప్రతినిధులు గోవిందరాజులు, రామాంజినేయులు మాట్లాడుతూ, ఈ అవగాహన సదస్సు ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నామని, ప్రభుత్వ ఉత్తర్వులను గౌరవిస్తామని, ప్రాథమిక చికిత్సలు అందించి ఇతర అర్హత ప్రమాణాల అస్పత్రులకు రెఫర్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముస్తఫా, నరసింహులు తోపాటు ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ రెవెన్యూ అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష

**జిల్లాలో రీ-సర్వే పనులను నాణ్యతతో వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.

తిరుపతి, అభివృద్ధి, ప్రజా సమస్యల వేగవంత పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డీఆర్వో నరసింహులతో కలిసి విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతి, గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్, వెబ్‌ల్యాండ్ పోర్టింగ్, లాగిన్ దశల్లో ఉన్న ఫైళ్ల స్థితిగతులను సమీక్షించారు. రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. భూ సరిహద్దుల వివాదాలు లేకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. గ్రామ సర్వేయర్ల సేవలను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీపై ప్రత్యేకంగా చర్చిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డేటా పరిశీలన, డిజిటల్ సంతకాలు, మ్యూటేషన్ సమస్యల పరిష్కారంపై వేగంగా పని చేయాలని, ఇది అత్యంత ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. 22ఏ కేసులు, కోర్టు కేసులు, భూ వివాదాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. వివాదాస్పద కేసులపై తక్షణ స్పందన ఉండాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల రక్షణ, ఆక్రమణల నివారణ, ప్రభుత్వ అవసరాలకు ఖాళీ భూముల గుర్తింపు, పారిశ్రామిక అవసరాల కోసం అందుబాటులో ఉన్న స్థలాల వివరాలను మండలాల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సూచించారు. భూసేకరణ పనులపై సమీక్షిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, పరిశ్రమలు, ప్రజా ఉపయోగాల నిర్మాణాలకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రాధాన్య ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పై సమీక్షిస్తూ, ప్రజల నుండి వచ్చిన వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, వీలైనంతవరకు మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించాలన్నారు.రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, వెబ్‌ల్యాండ్ డేటా శుద్ధి, గ్రామ స్థాయి రికార్డుల సమగ్రత, భూ వివరాల నవీకరణపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి రెవెన్యూ అధికారి ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జట్టు భావనతో పనిచేయాలని, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించడం ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉషాకిరణ్ హైస్కూల్ అద్భుత ప్రతిభ - కరస్పాండెంట్. బిఎస్. రమణారెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె




గురువారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో స్థానిక ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల మండలంలో ప్రథమ స్థానం సాధించి అద్భుత ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని షేక్. ఆఫ్నాన్ 592 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలియజేశారు. సిఎస్ మహమ్మద్ ఇంతియాజ్ 588 మార్కులు, ఆర్. లాస్య 580 మార్కులు సాధించి పాఠశాల టాపర్స్ గా నిలిచారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ బిఎస్. రమణా రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

## నాదెండ్ల భాస్కరరావుకి ఘన నివాళి సమర్పించిన దండి రాఘవయ్య



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు దండి నరేంద్ర ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని శ్రీకాళహస్తి జనసేన సీనియర్ నాయకులు దండి రాఘవయ్య (శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యులు), నియోజకవర్గ జనసేన నాయకులు హైదరాబాద్‌లోని వారి నివాసానికి చేరుకుని, భాస్కరరావు కి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా నాదెండ్ల మనోహర్ ని ఓదార్చు తూ, ఈ అపార నష్టాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని, పితృవియోగం నుండి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భాస్కరరావు మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షులు చిన్నతోటి నాగరాజు, మండల ఐటి కోఆర్డినేటర్ పి. దీనదయాల్, లక్ష్మణ్, శశి, తిలక్, చందు, చంద్రశేఖర్, నవీన్, పవన్ సాయి, అనిల్ అంజూరు, సతీష్ కొఠారి, దుర్గ, పృథ్వీరాజ్, సుబ్బు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమయ్య 7

శుక్రవారం 01 మే 2026


# వైభవంగా నరసింహస్వామి జయంతి వేడుకలు

### నరసింహస్వామికి తిరుప్పావడ సేవ -స్వామివారిని దర్శించుకున్న ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



పట్టణంలోని శ్రీ వాసవి కాలనీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నిత్యార్చన, తోమాల సేవ,సహస్రనామార్చన,నివేదన, యజ్ఞశాల ప్రవేశ ము, స్వస్తి వాచనము,అగ్నిప్రతిష్ట, ప్రధాన పరిహార కలశ ఆరాధన ప్రధాన నిత్య హోమాలని వేదిక తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అన్న ప్రసాదం, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి తిరుప్పా వడ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

నేడు తిరు కళ్యాణోత్సవం : పట్టణంలో శ్రీ వాసవి కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నేడు శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభ స్వామి వాళ్లకు తిరు కళ్యాణోత్సవము అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరం సమర్జించి తీర్థ ప్రసాదం అందుకోవాలని వారు తెలిపారు మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.



శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి పట్టణంలోని వాసవి కాలనీలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనర సింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ చైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ లు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని దుష్యాల్వా లతో,పూలహారాలతో సత్కరించి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మీ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంద న్నారు. పట్టణంలో ఇంత విశాలమైన ప్రదేశంలో ఆలయాన్ని నిర్మించడం చాలా గొప్ప విశేషం అన్నారు. వేద పండితులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దొంతు రవిశంకర్, మాజీ కౌన్సిలర్ లు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో గురువారం జరిగిన త్యాగరాజు, ప్రభావతుల కుమారుడు బింటు రాజు, నిర్మల రాణిలా వివాహ వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, మాజీ చైర్మన్ వరప్రసాద్,పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ లు హాజరై నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మూలి మహేశ్వర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, చెన్నూరు కార్తీక్, రవికుమార్ తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిషేధిత పత్తి విత్తనాల విక్రయం నేరం -ఏడిఏ బాల భాస్కర్

ప్రజాభూమి,పులివెందుల



నిషేధిత పత్తి విత్తనాలు విక్రయం నేరమని కలుపు మందులు తట్టుకునే పత్తి విత్తనాలకు రాష్ట్రంలో అనుమతి లేదని అటువంటి పత్తి విత్త నాలు విక్రయించడం చట్టరీత్యా నేరమని గుంటూ రు కమిషనర్ కార్యాలయ ఏ డి ఏ బాల భాస్కర్, వ్యవసాయ అధికారి సురేశన్ తెలిపారు. గురువా రం పులివెందుల పట్టణంలోని పత్తి విత్తనాలు విక్రయించే విత్తన దుకాణాలను తనిఖీ చేసి, దుకాణాల్లో నిల్వ ఉంచిన పత్తి విత్తనాలను సేకరించి వాటిలో కలుపు మందులు ఉన్నాయో లేదో అని టెస్టింగ్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనిఖీలలో డీలర్ల దగ్గర ఆ విత్తనాలు లభించలే దని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి మాట్లాడుతూ డీలర్లు గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూ టర్ల దగ్గర నుంచి మాత్రమే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు . రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ దగ్గర నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడు

### ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

### ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్

### ప్రజాదర్బార్ లో బీటెక్ రవి

ప్రజాభూమి,పులివెందుల

రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథం లో నడిపిస్తున్నాడనిఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, రాష్ట్రంలో వైకాపా పార్టీని ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) అన్నారు గురువారం ఆయన టిడిపి కార్యాలయం లో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గం నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలను సావదా నంగా విని ,వారిచ్చిన అర్జీలను ఆయన స్వీకరిం చారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి సమస్యలపరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా పార్టీని నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరన్నారు. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేయడం జరుగుతుందన్నారు. పులివెందుల అభివృద్ధి, ప్రజ ల సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బ్రాహ్మణ పల్లె వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## వేసవి విజ్ఞాన శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్

ప్రజాభూమి పోరుమామిళ్ల :



పోరుమామిళ్ల గ్రంథాలయంలో జరుగుతున్నవేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం నుండి స్పోకెన్ ఇంగ్లీష్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య తెలిపారు .గురువారం గ్రంథాలయ అధికారి ఆఫ్రిది ,జె వి వి నాయకులు దాదా పీర్ ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగయ్య మాట్లాడు తూ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఆంగ్లంలో అనర్గళంగా ఎలా మాట్లాడాలో వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ నిస్తాన న్నారు .విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జెవివి నాయకులు దాదా పీర్,గ్రంథాలయ పాఠకులు మహేంద్ర ,ఆలమూరు వెంకటస్వామి ,సంజీవరెడ్డి, రాము, ఖదీర్ బాష తదితరులు సూచించారు.

## తప్పుడు హామీలతో రాష్ట్ర ప్రజలను ముంచిన కూటమిప్రభుత్వం

### అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

### ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయమే వైకాపా లక్ష్యం

### ప్రజా దర్బార్ లో ఎంపీ అవినాష్ రెడ్డి

ప్రజాభూమి,పులివెందుల



కూటమి ప్రభుత్వంలో కూటమి నాయకులు పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, కూటమి ప్రభుత్వంలో రైతులు కుప్పకూలు తున్నారని , నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టడంలో విఫలమైందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం అయిన జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాత ఆర్తనాదాలు ఎక్కువయ్యాయని, కూటమి ప్రభుత్వం రైతన్నను పట్టించుకోవడంలేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ప్రభుత్వం కల్పించలేదని ఆయన అన్నారు. చీని,ఎర్రగడ్డలు, పెట్టిన పెట్టు బడులు కూడా రావడంలేదని గగ్గోలు పెడుతున్న ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 20నెల లు అయినా కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతి పత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్య లను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన పార్వతీపురం యస్.పి.బి.వి.డి సభా హైస్కూలు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పార్వతీపురం ఎస్.పి.బి.వి.డి సభా ఎయిడెడ్ పాఠశాల విద్యార్థి చింత గింజల గౌరి పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో సదరు విద్యార్థి 538 మార్కులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. మధుసూధన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తమ పాఠశాల విద్యార్థి అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన విద్యార్థిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి

### ఏ డి సి భాషను సన్మానించిన తూగుట్ల మధు




ప్రజాభూమి,పులివెందుల

నేషనల్ మజ్జూర్ యూనిటీ అసోసియేషన్ ఏ డి సి గా ఉద్యోగం చేసి గురువారం రిటైర్డ్ అయిన భాష ను మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి దుశ్శాలువాతో, పులహారంతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగి కి పదవీరమణ తప్పనిసరి అన్నారు. భాష ఏడిసిగా ఆయన మంచి సేవలు అందించారన్నారు. ఆయన చేసే జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలన్నారు. ఉద్యోగుల పట్ల ఆయన ఎంతో గౌరవంగా ఉండేవాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.













## ఆదర్శ పాఠశాల కె వి పల్లి యందు 10వ తరగతిలో సంచలనం




ప్రజాభూమి :కంభంవారిపల్లి




ఆదర్శ పాఠశాల కె.వి.పల్లి యందు పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిందని ప్రిన్సిపాల్ మూడే శీను నాయక్ తెలిపారు. 90 మంది పరీక్ష రాయగా 80 మంది పాసై 89% ఉత్తీర్ణత సాధించారని మరియు అత్యధికంగా 578 మార్కులుతో ఎస్ గోవర్ధన్ టాపర్ నిలిచాడని, 500 మార్కులకు పైగా 31 మందికి వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ చెన్నూరి బాలాజీ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ఖ30/04, 1:12 జూఎరి ౦91 94416 36657: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల, కంభంవారిపల్లె పదవ తరగతి ఫలితాలు -హాజరైన వారు : 90 ,ఉత్తీర్ణులైన వారు: 80 ,ఉత్తీర్ణత శాతం : 89%, మొదటి శ్రేణి : 71 -ద్వితీయ శ్రేణి : 09, అత్యధిక మార్కులు: 578, 31 మంది విద్యార్థులు 500ం మార్కులు సాధించడం విశేషం..

## నూతన వధూవరులను ఆశీర్వదించిన జనసేన నేత అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలోని ఎగువపేట ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన వివాహ మహోత్సవంలో జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు సంగటి వంశి, సుప్రజలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మంగళవాయిద్యాల మధ్య, ముత్యాల తలంబ్రాలతో కొత్త దంపతులను అతికారి కృష్ణ ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాటు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై జేఎంజే కళాశాల సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ శ్రీ లక్ష్మీనారాయణ జపం, నరసింహ హోమం, సుదర్శన హోమం, లక్ష్మీ హోమం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను కళ్లారా చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వేద పండితుడు ప్రసాద్ శర్మ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం ఆలయంలో లక్ష్మీ హోమం, ఉత్సవ మూర్తులకు కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## నారా లోకేష్ ను ఘనంగా సత్కరించిన కుప్పాల వెంకటసుబ్బయ్య

ప్రజాభూమి, సిద్దవటం: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం 'ఎన్టీఆర్ భవన్' బుధవారం కోలాహలంగా మారింది. పార్టీ నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిద్ధవటం మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య.. లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. యువ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పాల వెంకటసుబ్బయ్యతో పాటు పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. లోకేష్‌ను కలిసిన వారిలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన నాయకులతో మంగళగిరి పార్టీ కార్యాలయం సందడిగా మారింది.



## పది ఫలితాల్లో వేంకటేశ్వర స్కూల్ విజయదుందుభి



ప్రజాభూమి పోరుమామిళ్ల :

పదవ తరగతి ఫలితాలలో పి. భవ్యశ్రీ 590 మార్కులు సాధించి ఫలితాలలో పాఠశాల టాపర్ గా మరియు 580 మార్కులు పైగా 10 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల పాఠశాల కరెస్పాండెంట్ కె. పాండురంగారెడ్డి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. ధర్మారెడ్డి మరియు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

## భక్తి--శాస్త్ర--శిల్ప వైభవానికి ప్రతీక: నాగలాపురం వేదనారాయణ స్వామి దివ్యక్షేత్రం

ప్రజాభూమి ప్రతినిధి నాగలాపురం

మత్స్యావతార మహిమతో వెలుగొందుతున్న నాగలాపురం క్షేత్రం భక్తి, శిల్పకళ, శాస్త్రజ్ఞానాల సమ్మేళనంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడ విరాజిల్లుతున్న వేదనారాయణ స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచే పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందింది. పౌరాణిక వైభవంతో ఆకట్టుకునే ఈ క్షేత్రానికి ప్రతిరోజూ వివిధ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయంలో





జరుగుతున్న పూజలు, సేవలు భక్తుల్లో భక్తి భావాన్ని మరింతగా పెంపొందిస్తున్నాయి. పురాణాల ప్రకారం సోమకాసురుడు వేదాలను అపహరించగా, లోకం అజ్ఞానాంధకారంలో మునిగిపోయింది. దేవతల ప్రార్థనలతో మహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించి అసురుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అందజేశాడు. ఆ దివ్య ఘట్టం జరిగిన ప్రదేశమే నాగలాపురమని విశ్వాసం. మహాలక్ష్మి, పరమేశ్వరుడు మత్స్యరూపంలోని శ్రీహరిని దర్శించారని భావించడంతో ఈ క్షేత్రం "హరికాంతపురం"గా ప్రసిద్ధి చెందింది. పంచప్రాకారాలు, సప్తద్వారాలు, నాలుగు వైపులా గోపురాలతో ఆలయం అద్భుత నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తోంది. పల్లవుల నిర్మాణ శైలి, శ్రీకృష్ణదేవరాయల కాలం అభివృద్ధి కలగలసి ఆలయానికి ప్రత్యేకతను తెచ్చాయి. నాలుగు ద్వారాలకు విభిన్న ద్వారపాలకులు ఉండటం అరుదైన విశేషం. ఉప ఆలయాల్లో లక్ష్మీనరసింహ, కోదండరామ, హయగ్రీవ స్వామి దర్శనమిస్తారు. ప్రతి సంవత్సరం సూర్యకిరణాలు గర్భగుడిలోని మూలవిరాట్‌ను తాకడం ఈ ఆలయ ప్రధాన విశేషం. పాదాలు, నాభి, శిరస్సును వరుసగా స్పృశించే ఈ దివ్య దృశ్యం శిల్పవిజ్ఞానానికి నిదర్శనం. ఈ ఘట్టాన్ని "సూర్యపూజోత్సవం"గా భక్తి భరితంగా నిర్వహిస్తారు. మత్స్యనారాయణ స్వామి దర్శనం కేతు దోష నివారణకు, విద్యాభివృద్ధికి శ్రేయస్కరమని భక్తులు విశ్వసిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామిని శరణు కోరిన వారికి శత్రు బాధలు తొలగుతాయని పురాణాలు తెలియజేస్తున్నాయి. ప్రతిరోజూ నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదం అందిస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాదం నిర్వహించబడుతూ భక్తులకు ఆధ్యాత్మిక తృప్తి కలిగిస్తోంది. ప్రతి శనివారం అభిషేకం, సూర్యపూజోత్సవాలు, తెప్పోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, పుష్పయాగం, పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. మత్స్యజయంతి సందర్భంగా మత్స్యకారులు దీక్షలతో స్వామివారిని దర్శించుకోవడం ఈ క్షేత్ర ప్రత్యేకతగా నిలుస్తోంది. 1967లో టీటీడీలో విలీనం అయిన ఈ ఆలయం అప్పటి నుంచి అభివృద్ధి చెందుతూ వస్తోంది. 1971, 2008లో మహాసంప్రోక్షణలు నిర్వహించగా, 2026 ఫిబ్రవరిలో మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ పరిసరాల్లో రామాయణం, మహాభారతం, మత్స్యావతార ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి.

## శ్రీ పసన్న వెంకటేశ్వర స్వామి మహా కుంభాభిషేకం లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం యానాదివెట్టు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

## దామలచెరువులో నూతన ఫిజియోథెరపీ ఆసుపత్రి ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి పాకాల

పాకాల మండలం దామలచెరువులో నూతన శ్రీ వెంకటేశ్వర ధన్వంతరి ఫిజియోథెరపీ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరిగింది. ఈ



కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని కి ఆసుపత్రి యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ ఆసుపత్రిలో వివిధ వ్యాధులకు ఆయుర్వేద వైద్య విధానంలో మూలాలను గుర్తించి చికిత్సలు అందించడంతో పాటు సాంప్రదాయ కేరళ పంచకర్మ చికిత్సలు అందించడం ప్రత్యేకతగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఫిజియోథెరపీ సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆసుపత్రి యాజమాన్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెర్నికండ్రిగ మలుపు ప్రమాదాలకు పిలుపు

**బ్రిడ్జి వద్ద అదుపుతప్పిన బొగ్గులారీ -- తృటిలో తప్పిన భారీ ప్రమాదం**

ప్రజా భూమి ప్రతినిధి -- బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని నెర్నికండ్రిగ బ్రిడ్జి సమీపంలోని ప్రమాదకర మలుపు ప్రమాదానికి కారణమైంది. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ మలుపును తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపక్కకు పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో ఇతర వాహనాలు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బ్రిడ్జికి ఆనుకుని ఉన్న ఈ మలుపు చాలా ప్రమాదకరంగా మారిందని, తరచూ చిన్నా పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు మలుపును గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో సరైన హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమని స్థానికులు పేర్కొన్నారు. భారీ వాహనాలు వేగంగా రావడంతో డ్రైవర్లు నియంత్రణ కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర మలుపు వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని, రహదారి విస్తరణతో పాటు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో సత్యవేడు సుభిక్షం... యానాదివెట్టు కుంభాభిషేకంలో ఎమ్మెల్యే ఆదిమూలం, అన్నాదురై సన్మానం.



ప్రజాభూమి ప్రతినిధి సత్యవేడు

శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో సత్యవేడు నియోజకవర్గం ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆకాంక్షించారు. గురువారం వరదయ్యపాలెం మండలం యానాదివెట్టు గ్రామంలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారి సేవలో తరించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రాజలంతో ఉన్న కలశాన్ని తలపై ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేసి, సాంప్రదాయబద్ధంగా గర్భగుడి గోపురంపై మంత్రజలంతో అభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కుంభాభిషేక క్రతువు పూర్తయ్యింది. తదుపరి స్వామివారి మూల విరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికగా, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఇక నాగలాపురంలో బీఎస్ఎన్ఎల్ టెక్నీషియన్ అన్నాదురై పదవీ విరమణ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నాదురైకి శాలువ, గజమాలతో ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మి నృసింహ స్వామి జయంతి వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం పెరుమాలపల్లి పంచాయతీ వెలసిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి జయంతి మహోత్సవం 2026 కి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి



నాని .ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి పూర్ణకుంభ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో స్థానికనాయకులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసిన గ్రామ పెద్దలు. ఆలయంవద్దకు చేరుకొన్న భక్తులను ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో మైనర్ బాలుడికి రక్షణ... పోలీసుల అప్రమత్తతతో తల్లిదండ్రులకు సమాచారం



ప్రజాభూమి ప్రతినిధి తిరుమల

తిరుమలలో ఒంటరిగా సంచరిస్తున్న మైనర్ బాలుడిని పోలీసులు రక్షించి చట్టపరమైన విధానంలో బాలల సంక్షేమ కమిటీ కి అప్పగించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. 30-04-2026 ఉదయం సుమారు 9 గంటల సమయంలో తిరుమల లేపాక్షి సర్కిల్ పరిసరాల్లో ఒక బాలుడు ఒంటరిగా తిరుగుతుండగా తిరుమల 2 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది గమనించి అతనిని తమ వద్దకు తీసుకుని రక్షణ కల్పించారు. బాలుడు సి హెచ్ ధనుష్ (వయస్సు 13), స్వస్థలం కాకినాడగా గుర్తించారు. ప్రాథమిక విచారణలో తల్లిదండ్రులు మందలించడంతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు వెల్లడించాడు. బాలుడు ఇచ్చిన వివరాల ఆధారంగా అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం చట్టపరమైన విధానంలో బాలుడిని జబెజ ముందు హాజరుపరచి, తాత్కాలికంగా హోంలో చేర్పించారు. తల్లిదండ్రులు హాజరైన తర్వాత అవసరమైన ధృవీకరణల అనంతరం బాలుడిని వారికి అప్పగించనున్నారు. పిల్లలు ఒంటరిగా తిరుగుతున్న సందర్భాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వారితో ప్రేమతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. పరీక్ష ఫలితాల సమయంలో విద్యార్థులు నిరుత్సాహ పడకుండా తల్లిదండ్రులు మానసిక బలం ఇవ్వాలని పేర్కొన్నారు. బాలుడిని గమనించి వెంటనే స్పందించిన తిరుమల పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి ని హత్య చేసిన నిందితులను ఎన్కౌంటర్ చేయాలి

**-జర్నలిస్టులకు ప్రభుత్వాలు పూర్తి భద్రత కల్పించాలి.**
**-జర్నలిస్ట్ భద్రత కోసం పటిష్ఠమైన చట్టాలు రూపొంచాలి.**
**-జర్నలిస్ట్ మీద చేయి వేయాలంటేనే భయపడేలా చట్టం రూపొందించాలి**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

చిత్తూరు జిల్లా వి.కోటలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య అత్యంత దారుణమని ఈ ఘటన ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా నిలుస్తోందని గూడూరు కు చెందిన వెటర్న్ జర్నలిస్ట్ ఇసక పల్లి శివప్రసాద్ శర్మ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా పిలువబడే జర్నలిజం రోజురోజుకీ తన స్వేచ్ఛను కోల్పోతూ ప్రమాదంలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, హత్యలు జరుగుతున్నాయి అనడం అత్యంత ఆందోళనకరమని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి హత్యను కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా నిజాన్ని వెలికితీసే మీడియా స్వేచ్ఛపై జరిగిన దాడిగా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మీడియా ప్రతినిధులు భయపడకుండా తమ విధులు నిర్వహించేలా అనుకూల వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిజం స్వేచ్ఛను కాపాడటం ప్రతి ప్రభుత్వానికి బాధ్యత అని లేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన జర్నలిజం రోజురోజుకీ ప్రమాదంలో పడుతోందని, నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న హింసాత్మక ఘటనలను కట్టడి చేయడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వాలు పూర్తి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని వారి విధుల నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. జర్నలిస్టుల భద్రత కోసం పటిష్ఠమైన చట్టాలు రూపకల్పన చేయాలని జర్నలిస్ట్‌పై చేయి వేయాలంటేనే భయపడేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

**ఆర్ సి పురంలో బడి పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం**

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం**

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రాపురం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ చినబాబు, సింగల్ విండో చైర్మన్ జనార్దన్ చౌదరి అన్నారు. గురువారం స్థానిక కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి పిలుస్తుంది ఇంటింటి ప్రచార రథాన్ని డిప్యూటీ డీఈవో ఇందిరా దేవి తో కలసి వారు ప్రారంభించారు ఈ సందర్భంగా సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం రామచంద్రాపురం కూడలి వరకు ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన టీచర్స్ నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ మోజులో పడి ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి సర్కారు బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల్లో ఒత్తిడి లేని విద్యతోపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ నాయుడు, జిసిడివో పుష్ప, ఎంఈఓ లు మార్కొండయ్య నాయుడు, జయ వేలు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిఆర్ఎంటిలు, అంగన్వాడి టీచర్స్, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్వమాక్స్ కార్యాలయంలో పోషకాహారోత్సవం అనేఅంశంపై సమావేశం..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం లిమిటెడ్.(స్వమాక్స్) వారి ఆధ్వర్యంలో 'పోషకాహారోత్సవంలో భాగంగా "మహిళలు-పోషకాహారం" అనే అంశం మీద స్వమాక్స్ సీఈఓ సంగీతం విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ సభ్యులైన



వారు30 గ్రామాల నుండి 100 మంది మహిళా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ నిత్యం తీసుకునే ఆహారంలో పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని, 0 నుంచి 6 సంవత్సరాలలోపు ఉన్న బాల బాలికలు క్రమం తప్పకుండా కావలసినంత పౌష్టికాహారం నిర్వహించాలని, ప్రతి గర్భవతి, చిన్నపిల్లలు కోరుకునే అవకాశం కల్పించాలని కోరారు. పాలకవర్గ సభ్యులు పి. హైమావతి,సిబ్బంది ఎస్. రామనాథరెడ్డి, పి. సుబ్రహ్మణ్యం ఎం.రవి, కె.కౌసల్య, పి.వినోద్, హరి మరియు 100 మంది మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి మహోత్సవం పాల్గొన్న తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ పెరుమాళ్ళపల్లి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమంలో తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం



ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరుమాళ్ళపల్లి గ్రామ ప్రజల ఐక్యతతో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు దిగ్విజయంగా జరపడం సంతోషకరమన్నారు. లోక కల్యాణం కోసం, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన తుడా ఛైర్మన్ కి గ్రామ పెద్దలు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామస్తులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ మహోత్సవంలో పెరుమాళ్ళపల్లి గ్రామస్తులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## పి.వి. పురం ఎస్టిల జోలికొస్తే ఊరుకోం - సిపిఐ

ప్రాజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్.

తిరుపతి రూరల్ రామచంద్రపురం మండలం, పివిపురం ఎస్టీలు దళిత హక్కుల పోరాట సమితి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ పి.వి పురంలో 60 కుటుంబాల ఎస్టీలు సుమారు 50 ఏళ్లుగా నివాసం ఉన్నారని, ప్రస్తుతం కొందరు అగ్రవర్ణలకు చెందినవారు, గంగిరెడ్డి పల్లి బాబు రెడ్డి ఈ స్థలం మాకు చెందుతుందనీ, ఇల్లు ఖాళీ చేయాలని, వాటర్ ట్యాంకును కూడా పడదోసేస్తాం అని జెసిబి లతో ఎస్టీ కాలనీకి అనుకుని చదును చేయడం స్థానిక గిరిజనులను భయాందోళనకు గురి చేస్తున్నదనీ తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే చేసి ఎస్టీలను ఆదుకోవాలని వారికి భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ సంఘాల తిరుపతి జిల్లా కార్యదర్శి వై. నందయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు డా. ఆర్ బలరాం మాట్లాడుతూ పివిపురం ఎస్టిల పట్ల దురుసుగా ప్రవర్తించి వారి స్థలాలను ఆక్రమించే అగ్రవర్ణాలపై కేసులు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. పీవీ ఎస్టీలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని గిరిజనులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్డిఓ పరిపాలన అధికారి పి.ఝాన్సీ లక్ష్మి కి టీవీ పురం ఎస్టిల సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి జింక నాగరాజు, జనసేన నాయకులు శ్రీకాంత్, ఉష, రాజేష్, కే రవి, కిరణ్, గంగా చెంచయ్య పి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.





# భక్తి--జ్ఞానం--యోగానికి ప్రతిరూపం తరిగొండ వెంగమాంబ : ప్రముఖ సాహితీవేత్త శ్రీదేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



ఘనంగా ముగిసిన 296వ జయంతి ఉత్సవాలు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ భక్తి, జ్ఞానం, యోగసాధనల సమన్వయంగా వెలుగొందిన మహనీయురాలని ప్రముఖ సాహితీవేత్త శ్రీదేవి పేర్కొన్నారు. ఆమె జీవితం సంపూర్ణంగా శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తికి అంకితమై, ఆత్మసాక్షాత్కారానికి మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో



గురువారం నిర్వహించిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 296వ జయంతి ఉత్సవాలు భక్తి వాతావరణంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన సాహితీ సదస్సులో పండితులు వెంగమాంబ జీవితం, సాహిత్య విశిష్టతపై విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ యోగ జీవనం" అనే అంశంపై శ్రీదేవి మాట్లాడుతూ, వెంగమాంబ రచనలు సమాజంలోని లోపాలను ప్రశ్నిస్తూ నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఆమె జీవితం భక్తి, తపస్సు, ఆత్మసాక్షాత్కారానికి ఆదర్శంగా నిలిచిందని వివరించారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సహాయాచార్యులు డా. సుభాషిని మాట్లాడుతూ, వెంగమాంబ రచించిన "చెంచు నాటకం"లో స్త్రీ ఔన్నత్యం ప్రతిఫలిస్తుందని తెలిపారు. స్త్రీలోని ధైర్యం, స్వాభిమానం, సమానత్వ భావాలను వెంగమాంబ తన రచనల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారని చెప్పారు. మనస్తత్వ పరిశోధకులు డా. బాలాజీ దీక్షితులు మాట్లాడుతూ, వెంగమాంబ రచనలు భక్తి, భావోద్వేగం, ఆత్మానుభూతి సమన్వయంగా ఉండి భక్తిని పెంపొందిస్తాయని వివరించారు. సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద గల వెంగమాంబ విగ్రహానికి శ్వేత ఇన్‌చార్జ్ సంచాలకులు సువర్ణమ్మ పుష్పాంజలి ఘటించారు. తరిగొండలో ప్రత్యేక కార్యక్రమాలు తరిగొండలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం సంగీత సభ, హరికథ కార్యక్రమాలు నిర్వహించారు.

# మండల ప్రజల వేసవి తాపాన్ని తీర్చడమే

## ఎం. వి. రావు. ఫౌండేషన్ లక్ష్యం - తాహసిల్దార్ జయ జయ రావు



ప్రజాభూమి ప్రతినిధి కోట

రోజురోజుకీ మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కోట మండల కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను శీతల చలివేంద్రాన్ని ప్రారంభించారు.కార్యాలయాలకు వివిధ పనుల మీద వచ్చే కోట మండల ప్రజలు వడగాల్పులకు గురికాకుండా ఉండేందుకుగాను కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత శ్రీ విద్యా వికాస్ పాఠశాల యాజమాన్య సభ్యులు, స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు వారి శ్రీమతి ఆదిలక్ష్మి గార్ల జ్ఞాపకార్థం వారి పేరిట ఏర్పాటు అయినా ఎం వి రావు



ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం శీతల చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా దానిని కోట మండల రెవెన్యూ అధికారి కె. జయ జయ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఆర్‌ఓ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నేటికీ11.037 వ కార్యక్రమం గా ఈ శీతల చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రతి ఒక్కరు వేసవి తాపానికి గురికాకుండా ఈ చల్లని నీటిని తాగి ఉపశమనం పొందాలని తద్వారా స్వర్గీయ వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మికు మనశ్శాంతి కల్పించాలని జయ జయ రావు కోరారు.అనంతరం శీతల చలివేంద్రాన్ని మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించి ముందుగా కార్యాలయ అభివృద్ధి అధికారి శివకుమార్ కు చల్లని తాగు నీటిని అందించారు.అదేవిధంగా శివకుమార్ తహసీల్దార్ కు, తహసిల్దార్ ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ లీలామోహన్ కృష్ణకు కార్యాలయ సిబ్బందికి ప్రజలకు తాగునీటిని అందించడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ జయ జయ రావు మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శివకుమార్, ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి,, డిప్యూటీ ఎంపీడీవో అలీ భాష, మదన్, ఎన్ఆర్ఐ సిబ్బంది ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు - మే 1న స్వర్ణరథోత్సవం

### శేషాచలాన్ని తలపించిన శుక్రవారపుతోట

ప్రజా భూమి ప్రతినిధి తిరుచానూరు



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మే 1న ఉదయం ఉదయం 9.30 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది.వసంత ఋతువులో మేషరాశిలో సూర్యుడు ఎక్కువ ప్రకాశవంతంగా ఉంటాడు. సూర్యకిరణాల వేడి వల్ల జీవులకు వ్యాధి బాధలు కలుగుతాయి. శ్రీ పద్మావతి అమ్మవారిని వసంతోత్సవాల ద్వారా ఆరాధించడం వల్ల భక్తులకు శారీరక, మానసిక శాంతి లభిస్తుందని విశ్వాసం. వైభవంగా స్నపన తిరుమంజనం. వసంతోత్సవాల్లో భాగంగా గురువారం



ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవర్లను ఆలయం నుండి శుక్రవారపు తోటకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. 2.30 గంటల నుండి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించనున్నారు. శేషాచలాన్ని తలపించిన శుక్రవారపుతోట.టిటిడి ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారపు తోటలో శేషాచలం అడవిని తలపించేలా తీర్చిదిద్దారు. పచ్చని చెట్లు, పుష్పాలు, జంతువుల ఆకృతులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఆవు, దూడ, కోతి, నెమలి, హంసలు, చిలుకలు వంటి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో 300 కేజీల వట్టి వేరు, 500 కేజీల సాంప్రదాయ పుష్పాలు, 15 వేల కట్ ఫ్లవర్స్‌తో వివిధ రకాల ఫలాలు వినియోగించారు. ఇందులో బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన అలంకరణ నిపుణులు, టిటిడి సిబ్బంది ఇందుకోసం పనిచేశారు.ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు ముని చెంగల్రాయులు, రమేష్,సురేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు త్వరగా పూర్తి చేయండి.ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



నగరంలోని ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. గురువారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల లేఔట్లను, పారిశుధ్య పనులను



అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అందరూ కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చెపట్టాలని సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో రోడ్లలోని డివైడర్లలో మొక్కలు పెంచాలని సూచించారు. ఇంచార్జి కమిషనర్ వెంట డి.ఈ. దేవిక, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, టీపీఓ వంశీ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, ప్లానింగ్ సెక్రెటరిలు ఉన్నారు.

## పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమము



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి

పవన్ కళ్యాణ్ ఆశయంలో భాగంగా శ్రీకాళహస్తిలో ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ నందు పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో 79 వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమమును పవన్ కళ్యాణ్ ఆశయాల కృషి కోసం పనిచేసే జనసేన నాయకులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, మనీ, డాక్టర్ నక్కా ప్రసాద్, హరి, దినేష్, ముని చంద్ర, రాజా, నవీన్ వీర మహిళలు పేట శారద, నారాయణ గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థుల విజయోత్సవం..!

ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:



చంద్రగిరి మండలంలో పదవ తరగతి పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థినీలు చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా విజయోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్. లలిత్య కుమారి, భాస్కర్ బాబు మరియు ప్రధానోపాధ్యాయులు వి. వెంకట్రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు, మొదటి, రెండవ మరియు మూడవ స్థానాలను సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజయాన్ని ఆనందంగా పంచుకుంటూ, కేక్ కట్ చేసి వేడుకను జరుపుకున్నారు. అతిథులు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ,



భవిష్యత్తులో కూడా ఇలాగే కృషి చేసి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాధనకు ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం ముఖ్యమని వారు పేర్కొన్నారు. అదేవిధంగా, పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఎటువంటి నిరుత్సాహానికి లోనుకాకుండా, అనవసర ఆలోచనలకు దూరంగా ఉండాలని సూచించారు. రాబోయే పరీక్షల్లో కష్టపడి చదివి తప్పక ఉత్తీర్ణులు కావాలని ప్రోత్సహించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు వారికి పూర్తి సహకారం, ప్రోత్సాహం అందించవలసిందిగా మండల విద్యాశాఖ అధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

## చంద్రగిరి మండలంలో 10 వ తరగతి పరీక్షల్లో 81 శాతం ఉత్తీర్ణత..!



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం పరిధిలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి ఫలితాలు ప్రకటించబడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని పాఠశాలల ఫలితాల వివరాలు ఇలా ఉన్నాయని ఎంఈఓ లలిత కుమారి మరియు భాస్కర్ బాబు సంయుక్తంగా తెలిపారు. మండలంలోని మొత్తం 9 పాఠశాలల నుంచి 440 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 358 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 81%గా నమోదైంది.

100% ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు: 1.పనపాకం జిల్లా పరిషత్ హై స్కూల్,2.కొంగరవారి పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్,3.కోటాల జిల్లా పరిషత్ హై స్కూల్, 4.ఎ. రంగంపేట జిల్లా పరిషత్ హై స్కూల్, ఇతర పాఠశాలల ఫలితాలు: 5.ఇట్టేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ -- 82% 6. చంద్రగిరి శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్,-- 82% 7.నరసింగాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ -- 73%, 8.చంద్రగిరిగవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్--70%, 9.తొండవాడ జిల్లా పరిషత్ హై స్కూల్ -- 62% ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో మండల స్థాయి టాపర్స్: 1.ఎస్. సాయిహర్షిణి ( శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ హై స్కూల్ చంద్రగిరి గర్ల్స్) -- 587 మార్కులు (97.83%), 2.బి. ధామిని ( శ్రీ పద్మావతి జిల్లా పరిషత్ హై స్కూల్ చంద్రగిరి గర్ల్స్) -- 582 మార్కులు (97.00%), 3.వి. యశస్విని ( జిల్లా పరిషత్ హై స్కూల్ పనపాకం) -- 579 మార్కులు (96.50%) టాపర్ గా నిలిచారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులను అధికారులు అభినందించారు. మండలంలోని విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వారు తెలిపారు.

## చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్పీ పై దాడి

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన.

### స్పందించిన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

### తక్షణ చర్యలకు ఆదేశం.

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు



జిల్లా కేంద్రమైన చిత్తూరులో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆర్పీ పై జరిగిన దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని పై స్పందించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.., దాడి ఘటన సంబంధించిన వివరాలను చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, చిత్తూరు నగర పాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ను అడిగి తెలుసుకున్నారు. బాధిత ఆర్పీకి అధికారులు అండగా నిలవాలని.., అవగాహన రాహిత్యంగా వ్యవహరించి, విధుల్లో ఉన్న ఆర్పీ పై దాడి చేసిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓ మహిళా ఆర్పీ పై అమానవీయంగా ప్రవర్తించడం దురదృష్టకరమని ఖండించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ, నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు.. పొదుపు సంఘాల సభ్యులు కూడా తమ సమస్యను అధికారుల దృష్టికి తెచ్చి, సమన్వయంతో పరిష్కరించుకోవాలే గాని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదనీ, తొందరపడి భౌతిక దాడులకు దిగకూడదని ఆయన హితబోధ చేశారు.

## మే డే వేడుకలకు ముఖ్య అతిథిగా తుడా ఛైర్మన్ 'డాలర్స్' దివాకర్ రెడ్డి ని ఆహ్వానించిన బాలాజీ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రాజా భూమి ప్రతినిధి తిరుపతి.



బాలాజీ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపు మే 1న నిర్వహించనున్న అంతర్జాతీయ కార్మిక దినోత్సవ (మే డే) వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి.ని అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు స్పందిస్తూ ప్రతి ఏటా కార్మికుల సంక్షేమం మరియు ఐక్యతను చాటిచెప్పేలా తాము నిర్వహించే ఈ వేడుకలకు దివాకర్ రెడ్డి. సానుకూలంగా స్పందించి, హాజరవుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పెంచలకోనలో భక్తి వాతావరణం నడుమ స్కౌట్స్ సేవలు



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

పెంచలకోన శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయం లో జరుగుతున్న శ్రీలక్ష్మి నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు విశేష సేవలను అందిస్తున్నారు.భక్తులకు మార్గదర్శనం చేయడం, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించడం, తాగునీరు అందించడం, వృద్ధులు మరియు చిన్నారులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాలలో స్కౌట్స్ విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారు. భారీగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.సేవా భావంతో ముందుకు వచ్చిన ఈ విద్యార్థులు "సేవే మా ధర్మం" అనే నినాదంతో పనిచేస్తున్నామని స్కౌట్ మాస్టర్ విద్యాసాగర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఆలయ అధికారులు అభినందించారు. స్థానికులు మరియు భక్తులు కూడా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సేవలను ప్రశంసిస్తూ, వారి సేవా స్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్స్ విద్యార్థులు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు

## పదో తరగతి ఫలితాలు వెల్లడి - ప్రభుత్వ పాఠశాలల్లో 61 శాతం ఉత్తీర్ణత -- ప్రైవేట్ పాఠశాలల సత్తా







ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉత్తీర్ణత శాతం వెల్లడైంది. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 229 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 139 మంది ఉత్తీర్ణత సాధించి 61 శాతం ఫలితాలు నమోదయ్యాయి. బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 98 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 59 మంది ఉత్తీర్ణత సాధించి 60 శాతం ఫలితాలు నమోదు అయ్యాయి. చల్లమాంబాపురం ప్రభుత్వ పాఠశాలలో 12 మంది పరీక్షలు రాయగా, అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు సాధించారు. అదేవిధంగా కల్లిబెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మంది పరీక్షలు రాయగా, 22 మంది ఉత్తీర్ణత సాధించి 88 శాతం ఫలితాలు నమోదు అయ్యాయి. మరో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 24 మంది




పరీక్షలు రాయగా, 12 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించి 50 శాతం ఫలితాలు నమోదయ్యాయి. పల్లమాల జిల్లా పరిషత్ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు గాను 34 మంది ఉత్తీర్ణత సాధించి 49 శాతం ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్లో కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇషాంత్ 568 మార్కులు సాధించగా, పల్లమాల పాఠశాలకు చెందిన పి. సురేంద్ర 561 మార్కులు, పి. అఖిల్ 546 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రైవేట్ పాఠశాలల ఫలితాలను పరిశీలిస్తే, అక్షర ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు నమోదు చేశారు. వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఆరుగురు కూడా ఉత్తీర్ణత సాధించారు. శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పబ్లిక్ స్కూల్‌లో 44 మంది విద్యార్థులకు గాను 38 మంది ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు.

## శ్రీ నాదెండ్ల భాస్కరరావుకు ఘన అర్పించిన జనసేన నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు దండి నరేంద్ర ఆధ్వర్యంలో.. పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు మరియు జనసేన పార్టీ (పి ఎ



సి) చైర్మన్ నాదెండ్ల మనోహర్,ను ఆయన నివాసంలో కలిసి పరామర్శించిన శ్రీ కాళహస్తి జనసేన నాయకులు.. జనసేన సీనియర్ నాయకులు దండి రాఘవయ్య (శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యులు), దండి నరేంద్ర మరియు నియోజకవర్గ ముఖ్య నాయకులు హైదరాబాద్‌లోని వారి నివాసానికి చేరుకుని, భాస్కరరావు గారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్,కు, తండ్రిని కోల్పోయిననష్టాన్ని, తట్టుకునే ధైర్యం కలగాలని, పితృవియోగం నుండి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భాస్కరరావు మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల అధ్యక్షులు చిన్నతోటి నాగరాజు, మండల ఐటి , కోఆర్డినేటర్ పి. దీనదయాల్, లక్ష్మణ్, శశి, తిలక్, చందు, చంద్రశేఖర్, నవీన్, పవన్ సాయి, అనిల్ అంజూరు, సతీష్ కొఠారి, దుర్గ, పృథ్వీరాజ్, చలం, సుబ్బు తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## అమర హాస్పిటల్‌లో కిడ్నీ షీల్డ్ ప్యాకేజీ ఆవిష్కరణ

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట



ప్రజలలో మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు మరియు ప్రారంభ దశలోనే కిడ్నీ సంబంధిత సమస్యలను గుర్తించేందుకు మా ఆసుపత్రి ప్రత్యేకంగా "కిడ్నీ షీల్డ్ ప్యాకేజీ" ను ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరీనేనిమాట్లాడుతూ, "ప్రస్తుతం డయాబెటిస్, బీపీ వంటి జీవనశైలి వ్యాధుల కారణంగా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయి. అందుకే అందరికీ అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలో ఈ ప్యాకేజీని ప్రారంభించాము" అని తెలిపారు. మ్యానేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ, "ప్రజలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. ఈ ప్యాకేజీ అందుకు ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శివపార్వతి మాట్లాడుతూ, "కిడ్నీ వ్యాధులు చాలా సార్లు లక్షణాలు లేకుండా ఉంటాయి. కాబట్టి రెగ్యులర్ స్క్రీనింగ్ చాలా అవసరం" అని సూచించారు. వేణుగోపాల్ ( సి, బి ,ఓ) మాట్లాడుతూ, "ఈ ప్యాకేజీని మరింత మంది ఉపయోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరుతున్నాము" అని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొని, ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు తమ కట్టుబాటును తెలియజేశారు.

ప్యాకేజీ వివరాలు: ధర: రూ. 399/- మాత్రమే

పరీక్షలు: హెచ్ బి, సిరం క్రియేటినిన, బ్లడ్ యురేయ నైట్రోజన్(బున్) యూరిక్యాసిడ్ కంప్లీట్ యూరిన్ , కంప్లీట్ పరీక్షలు, నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్ ఈ ప్యాకేజీ డయాబెటిస్, బీపీ ఉన్నవారు, కుటుంబంలో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా వినియోగించుకోవాలి. చెల్లుబాటు: 28 మే 2026 వరకు మాత్రమే. మరిన్ని వివరాలకు అమరఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి వైద్యసేవలను , వినియోగించుకోవాలని తెలిపారు.

## పది ఫలితాల్లో సత్తా చాటిన విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు




పది ఫలితాల్లో వీ.ఎస్సార్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్దులు సత్తా చాటారు..589 మార్కులతో హిమ సంజన,586 మార్కులతో నఫీసుర్ రెహమాన్,581 మార్కులతో గీతానాధ్ నిలిచారు.దీంతో పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డి పల్లి ప్రాంతంలో ఏర్పాటై ఉన్న వీ.ఎస్సార్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్దులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచారు.దీంతో పాఠశాలలో విద్యార్దులు,ఉపాద్యాయులు సంబరాలు చేసుకున్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్దులను పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణం రాజు తదితరులు అభినందించారు.589 మార్కులతో హిమ సంజన పాఠశాలలో ప్రధమ స్దానంలో నిలిచింది.అలాగే 586 మార్కులతో నఫీసుర్ రెహమాన్ ద్వితీయ, 581 మార్కులతో గీతానాధ్ త్రుతీయ స్దానాల్లో నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణం రాజు మాట్లాడుతూ..పది పరీక్షల్లో తమ విద్యార్దులు మంచి మార్కులు సాధించారన్నారు.ఇందుకు సహకరించిన ఉపాద్యాయులు,తల్లిదండ్రులను అభినందిస్తున్నట్లు ఆయన వివరించారు.ఇంకా ఉపాద్యాయులు, విద్యార్దులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామి మహా కుంభాభిషేకం లో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం



తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం యానాదివెట్టు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

## తిరుపతి జిల్లా పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన సిబ్బందికి ఘన సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




ఏప్రిల్ నెలలో పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి ఎల్. సుబ్బరాయుడు దీర్ఘకాలం సేవలందించిన అధికారులను, సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సేవ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి అంకితమైన బాధ్యత అని తెలిపారు. ప్రజల భద్రత కోసం చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, వారి క్రమశిక్షణ, నిబద్ధత యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజానికి మార్గదర్శకులుగా కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నజీర్ బేగ్ (ఉప నిరీక్షకుడు), భారత్ కుమార్ (సహాయ ఉప నిరీక్షకుడు), రాఘవులు (ముఖ్య కానిస్టేబుల్), కనక రాజ్ (ముఖ్య కానిస్టేబుల్), నంద కుమార్ (ఆర్మ్డ్ రిజర్వ్ ముఖ్య కానిస్టేబుల్)లను సన్మానించారు. సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. పదవీ విరమణ పొందిన సిబ్బంది తమ సేవా కాలాన్ని స్మరించుకుంటూ పోలీస్ శాఖలో పనిచేయడం గర్వకారణమని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం మరపురాని అనుభూతిగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారులు వెంకట్రావు (పరిపాలన), శ్రీనివాసులు (నేర విభాగం), శ్రీనివాస రావు (సాయుధ దళం), ప్రత్యేక శాఖ ఉప పోలీసు అధికారి గీతా కుమారి, సంఘ ప్రతినిధులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో శ్రీ కావమ్మ-మారయ్య తిరునాళ్ళు..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి :



చంద్రగిరిలో వెలసి యున్న శ్రీ కావమ్మ -మారయ్య ఉత్సవాలు శుక్రవారం నుండి ఆదివారం వరకు నిర్వహించబడునని ఆలయ ధర్మకర్త లక్ష్మి తులసి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం నుండి ఆదివారం వరకు జరుగు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు గావించిరి. రాత్రి 8 గంటలకు అన్నదానము రాత్రి 10 గంటలకు రఘురామ్ బృందముచే వేషధారణగా బుర్రకథ నిర్వహించి, రాత్రి 2 గంటలకు శ్రీ కావమ్మ మారయ్య వివాహము నిర్వహించదురని తెలిపారు. శనివారం రాత్రి 7 గంటలకు స్వామి,అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించి, రాత్రి 8 గంటలకు అన్నదానము, రాత్రి 10 గంటలకు బుర్రకథ, రాత్రి రెండు గంటలకు సారెపంచుట కార్యక్రమం. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం చేయదలచిన వారు సాయంత్రం 6 గంటలకు కంకణంకట్టుకొనవలెను. రాత్రి 8 గంటలకు అన్నదానం, రాత్రి 10 గంటలకు బుర్రకథ, కథానంతరము అగ్నిగుండ ప్రవేశం నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు పసుపులేటి సరస్వతి రమణ, కోశాధికారి రంగు ధనలక్ష్మి రాజేంద్ర, కార్యనిర్వాహకులు నాగమ్మ పుల్లయ్య మరియు కే జి ఎస్ యూత్ భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాయ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అధిక సంఖ్యలో అత్యధిక మార్కులు సాధించడం గర్వంగా ఉందని



పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా 589, 584 మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించి సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి 589 మార్కులతో జిల్లా 8వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా 500 పైగా 42 మంది విద్యార్థులు, 550 పైగా 20 మంది విద్యార్థులు మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. 165 మంది విద్యార్థులు హాజరవ్వగా 131 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## బి.ఎన్. కండ్రిగలో పోలీసుల వాహన తనిఖీలు

### నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు

### సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్

ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలో స్థానిక ఎస్సై హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత



తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీ వద్ద, ప్రధాన రహదారులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాహనాలను ఆపి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్, కాలుష్య ధ్రువపత్రాలు లేని వాహనదారులను గుర్తించి వారికి జరిమానాలు విధించారు. అలాగే డ్రింక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై కేసులు నమోదు చేశారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్సై హరిప్రసాద్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## స్విమ్స్--టీటీడీ ప్రాణదాన పథకం కింద 190 మంది పేద రోగుల ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.



శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాణదాన పథకం కింద 190 మంది పేద రోగులను ఉచిత శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. గురువారం మధ్యాహ్నం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. స్విమ్స్ డైరెక్టర్ మరియు ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, బర్డ్ హాస్పిటల్ డా. దీపక్, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. పి. శ్రీనివాస్, మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక స్థితి, బియ్యం కార్డు వంటి అర్హతలను పరిశీలించి ఎంపిక చేశారు.

**విభాగాల వారీగా ఎంపికైన రోగుల సంఖ్య ఇలా ఉంది:** కార్డియాలజీ--2, కార్డియోథొరాసిక్--17, జనరల్ సర్జరీ--9, మెడిసిన్--15, నెఫ్రాలజీ--73, న్యూరాలజీ--6, న్యూరో సర్జరీ--40, గైనకాలజీ--6, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ--18, సర్జికల్ ఆంకాలజీ--3, యూరాలజీ--1. మొత్తం 190 మందికి ఉచిత చికిత్సలు అందించనున్నారు. ప్రాణదాన పథకం ద్వారా పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్న టీటీడీ యాజమాన్యానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి దాతలు, సంస్థలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన ఎంజీఎం స్కూల్ విద్యార్థులు



ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలోని ఎంజీఎం స్కూల్ విద్యార్థులు గురపాడ్ నాయక్ 589/600, కే.తోషిని 589/600 మార్కులు సాధించి టాప్ లో నిలిచారు. అంతేకాకుండా చెంచు చితిష్ కుమార్ 588/600, కే.నివేదిత 586/600.ఎస్ జోష్నాథ్ 584/600 మార్కులు సాధించారు. అంతేకాకుండా మా విద్యార్థులు 500 కు పై చిలుకు 33 మంది విజయ్ కేతనం చేశారు.ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్చంతో అభినందించి ముందు ముందు పై తరగతులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకొని కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపేర్ అయ్యే విధంగా మీ యొక్క విద్యా విధానాన్ని సులభతరంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, ఎంజిఎం స్కూల్ హెడ్మాస్టర్ ముని రత్నం నాయుడు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో ఖాన్స్ రెయిన్బో స్కూల్ మండలంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచింది



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

విద్యార్థుల మెరుగైన ప్రతిభతో స్కూల్ రికార్డు ఫలితాలు రేణిగుంట,ఏప్రిల్ 30 : రేణిగుంట పట్టణంలోని ఖాన్స్ రెయిన్బో స్కూల్ 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది.పాఠశాల విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకోవడంతో స్కూల్‌కు మంచి పేరు తీసుకువచ్చారు.ఈ ఫలితాల్లో దైదీప్య జస్మితా జి,బాను జి ఇద్దరూ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు.మోనిషా రెడ్డి సి,హఫ్సా షేక్,కీర్తిక బి 590 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని పొందారు. రీతిక 589 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది.విద్యార్థుల ఈ అద్భుత ఫలితాలపై పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.క్రమశిక్షణతో కూడిన బోధన,విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కరస్పాండెంట్ అత్తా ఉల్లా ఖాన్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.అదేవిదంగా 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

# నాయీ బ్రాహ్మణులకు భరోసా ఇచ్చింది టిడిపినే

### -వైద్యం శాంతారాం, కోట చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

నాయీని బ్రాహ్మణులు తరతరాలుగా కుల వృత్తిని ఆధారంగా చేసుకొని చాలీచాలని జీతభత్యాలతో జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణ కుటుంబాలలో వెలుగులు నింపి, వారి జీవితాలకు భరోసా ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే అని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యం శాంతారాం మరియు తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ కొనియాడారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేసిన నాయీ బ్రాహ్మణ రాష్ట్ర నాయకులు చొప్పెళ్ళ శ్రీను నాయీ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల ఆశీర్వాద బలంతో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ,గురువారం మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోలేక, సాంప్రదాయిక కుల వృత్తిని మాత్రమే నమ్ముకొని తీవ్రమైన అణచివేతకు గురవుతున్న నాయీ బ్రాహ్మణులు అటు రాజకీయంగా ఇటు ఆర్థికంగా అభివృద్ధి చెంది, సమాజంలో గౌరవాన్ని పొందేందుకు అనేక అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తోనే అని, టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఏవిధంగా అయితే నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచారో, సియం చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర మంత్రి మరియు తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కూడా తమ బాగోగులు చూసుకుంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వైద్యం శాంతారాం, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర నాయకులు ఈదర శ్రీనివాసులు,నాయీ బ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్, తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,వంగపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభం లోపే స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్వహణలోకి రావాలి..! - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ప్రజాభూమి ప్రతినిధి,కడప :



జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను పాఠశాలల పునఃప్రారంభం లోపు నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై.. సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలై.. జాతీయ స్థాయిలో అత్యుత్తమ పురస్కారంతో పాటు, ఇతర రాష్ట్రాలకు కూడా స్ఫూర్తినిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణాలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల స్మార్ట్ కిచెన్ లద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని.. మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఆయా మండలాల్లో వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే.. పరికరాల కోసం టెండర్, కొనుగోలు, ఆయా పాఠశాలలకు ఫుడ్ ట్రాన్స్ పోర్టేషన్ కు అవసరమైన వాహనాలు మొదలైన అంశాలపై సమీక్షించారు. నిర్మాణం, పరికరాల ఏర్పాటు తదితర అన్ని పనులను జూన్ 1వ తేదీలోపు పూర్తి చేసి కిచెన్ షెడ్స్ ను నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా కూడా జాప్యం జరగకూడదని హెచ్చరించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు సద్వినియోగం. చేసుకునేలా సంతృప్తికరంగా నిర్వహణ జరగాలన్నారు. మండల గ్రామీణ స్థాయిలో మదర్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేసి.. వారిని కూడా భాగస్వామ్యం చేయాల్సి వుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్, కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబందిత అంశాలపై ఎపి సీఎన్ఎఫ్, డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ రాకేష్ చంద్రం, సిపిఓ హాజరతయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ పీడి రాజరత్నం, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, డిఏవో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, ఎల్డిఎం జనార్ధనం, నెడ్ క్యాప్ జిల్లా మెనేజర్ ఎల్లారెడ్డి, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఆకాంక్ష జిల్లా ప్రోగ్రామ్ యాంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పద్ధతిలో కూటమి ప్రభుత్వాన్ని కుప్పకూలుస్తాం

### కక్ష సాధింపు రాజకీయాలే తప్ప.. ప్రజాస్వామ్య పాలన కాదు -ఒకటే నేరారోపణ...36 కేసులు-మాజీ మంత్రి అంబటి రాంబాబు


ప్రజాభూమి,పులివెందుల



రాష్ట్రంలో కక్ష సాధింపులే సాధింపు రాజకీయాలే తప్ప,ప్రజాస్వామ్య పాలన కాదని, కూటమి ప్రభు త్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కుప్పకూలుస్తామని మాజీమంత్రి అంబటి రాంబాబు ప్రభుత్వంపై విరు చుకుపడ్డారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో చంద్రబాబును దూషించారని నిందారో పణపై విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియా సమావేశంలోఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును దూషించానని సాయి భాస్కర్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారని, అందులో భాగంగా విచారణకు హాజరైనట్లు ఆయన తెలిపా రు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం తెలిపాను అన్నారు. జనవరి 31న చంద్రబాబు నాయుడు ను దూషించినందుకు తనపై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. జైలులో 18 రోజులు రిమాండ్ లో ఉంచి బయలు పై విడుదల అయ్యా నని అయితే ఒకటే ఆ నేరఆరోపణ తో తనపై 36 కేసులు నమోదు చేయడం సమంజసమా అని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కోర్టు ఆర్డర్ ను ధిక్కరించి తనను చట్ట వ్యతిరేకంగా విచారిస్తున్నారని, వీరిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి కోర్టు ముందు నిలబెడతానన్నారు. చంద్రబాబు, లోకేష్ బాబుల ఆదేశాల మేరకు డిజిపి డైరెక్షన్ లో తనను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎన్నో అక్రమ కేసులు బనాయించి తనను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చట్టం చంద్రబాబుకు ఒకరకంగా జగన్ కు ఒకరకంగా ఉందన్నారు. చంద్రబాబును దూషిస్తే కేసులు జగన్ ను దూషిస్తే కేసులు పెట్టరా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను చంద్రబాబును దూషించానని కేసులు నమోదు చేసి జైలుకు పంపి తెలుగుదేశం పార్టీ అల్లరి మూకలు తన ఇంటిని, ఫర్నిచర్,కారు ధ్వంసం చేస్తే ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని ఆయన ఆరోపించారు. చట్టం తెలుగుదేశం నాయకులకు చుట్టంగా మారిందన్నారు. అన్ని గమనిస్తున్నామని తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి కోసం ఎన్నో కష్టాలు పడతామని,మరలా వైకాపా పార్టీ అధికారం వచ్చాక బదులు తీర్చుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కుప్పకూలుస్తామని ఆయన అన్నారు.రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలే తప్ప,ప్రజాస్వామ్య పాలన కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండుగ కార్యక్రమానికి సన్నద్ధం కండి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజాభూమి ప్రతినిధి,వైయస్సార్ కడప:

రైతులకు సాంకేతికతతో పంట దిగుబడి మార్కెట్ కు అనుసంధానం చేసే అంశాలపై అవగాహన కల్పించేందుకు మే 22 నుంచి 24 వరకు వైఎస్ఆర్ కడప జిల్లాలో నిర్వహించనున్న రైతు పండుగ కార్యక్రమానికి సంబంధిత అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరేట్ లోని బోర్డ్ రూమ్ నందు రైతు పండుగ కార్యక్రమం నిర్వహణకు సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రైతు పండుగ కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించేందుకు అవసరమైన సన్నాహ ఏర్పాట్లుప్రారంభించాలన్నారువ్యవసాయ,ఉద్యానవన, పశు సంవర్ధక,పట్టు పరిశ్రమ,మత్స్య శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కొని రైతులు అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన, నాబార్డు, ఇతర బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందే సౌకర్యం,పండించిన పంటను మార్కెటింగ్ చేసే అంశాలపై అవగాహన,ఇలా రైతు పండుగ కార్యక్రమం రైతులకు మరింత లాభదాయకంగా మారేలా కార్యాచరణ ప్రణాళిక ను సిద్ధం చేయాలని ఆదేశించారు...ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థుల అద్భుత ఫలితాలు

### - కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి




ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. గురువారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో జూటూరి రజిత 591 మార్కులు, జి. లక్ష్మి మహిదర్ 590 మార్కులు, జి. తేజవర్ధన్ 584 మార్కులు, కె. రెడ్డి శ్రీకర్ 584 మార్కులు, కె. శైనీ రోశని 583 మార్కులు, పి. గంగా లక్ష్మీ నందిని 580 మార్కులు, ఎస్బి మహమ్మద్ షోహెబ్ 580 మార్కులు సాధించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం మరియు తల్లిదండ్రుల సహకారంతో ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి లు విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు.


# గృహగణనఎన్యూమరేటర్స్ కు సహకరించండి:తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి..!



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

2027 గృహగణన ప్రారంభమవుతుందని తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి అన్నారు. గురువారం తహశీల్దార్ ఈ మేరకు వివరాలను వెళ్ళడించారు. గృహగణనకు ఎటువంటి ఐడి కార్డును అడగరని అన్నారు. అదేవిధంగా ఓటిపి సైతం అడగరని అన్నారు. గృహగణన వలన ప్రభుత్వ పథకాలు తొలగించబడవని అన్నారు. ప్రతి కుటుంబం గృహగణన చేసుకోవాలని కోరారు. గృహగణనలో భాగంగా మీ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్స్ పై అనుమానం కలిగితే వారి ఐడి కార్డును స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయని అన్నారు.

# నారా లోకేష్ ని కలిసినతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్



ప్రజా భూమి పోరుమామిళ్ల :

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా యనమల సుధాకర్ ప్రమాణ స్వీకారం అనంతరం. విజయవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ నీకు ఇచ్చిన పదవిని సద్వినియోగపరచుకొని పార్టీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వారిని గుర్తిస్తూ రాష్ట్ర పొలిట్ బ్యూరో కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని అందులో రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా నన్ను ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం నా వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డికి, మాజీ పొలిట్ బ్యూరో శ్రీనివాస్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు, బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రెడ్డి కి తెలుగుదేశం నాయకులకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# మానవతా సంస్థకు ఫ్రీజర్ బాక్స్ వితరణ



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు మొయిళ్ళ చెరువుకు చెందిన కంభం తిరుమలరెడ్డి 70 వేలు వెచ్చించి ఫ్రీజర్ బాక్స్ ను వితరణ గా అందజేశారు. మానవతా నెలవారి సమావేశం స్థానిక గీతా మందిరము లో సంస్థ ప్రెసిడెంట్ జి. చంద్రశేఖర రెడ్డి అధ్యక్షతన గురు వారం నిర్వహించారు.ఈ సందర్భంగా తిరుమల రెడ్డి సమీప బంధువు యం. వి నారాయణరెడ్డి ఫ్రీజర్ బాక్స్ ను ప్రారంభోత్సవముగావించి సంస్థకు అందజేశారు.సమావేశంలో ముఖ్య అతిథులు ఎంఈఓ ఎంవి నారాయణరెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ చంద్రశేఖర్ రెడ్డి, కే సి వి సుబ్బారెడ్డి,చైర్మన్ డి,వి కొండారెడ్డి,ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ బి వి కృష్ణారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి లు మాట్లాడుతూ కంభం తిరుమల రెడ్డి సేవా నిరతిని కొనియాడారు. ప్రతి ఏటా పులివెందులలో వందలాదిమందికి శంకర్ నేత్రాలయము ద్వారా కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు, ఉచితంగా చేయిస్తున్న వైనాన్ని ఉదహ రించారు.మానవతా సేవలకు ఫ్రీజర్ బాక్స్ మరింత దోహదం చేస్తుందన్నారు.

మానవతకు 25 వేలు విరాళం : సింహాద్రిపురం మండలం బలపనూరు కు చెందిన ఎలుగోటి జగదీశ్వర్ రెడ్డి రూ 25 వేలు విరాళం ప్రకటించి శాశ్వత సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు వక్తలు జగదీశ్వర్ రెడ్డి, స్వర్ణలత దంపతుల ఔదార్యాన్ని ప్రశంసించారు. సమావేశానికి విచ్చేసిన సభ్యులకు సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,రిటైర్డ్ లెక్చరర్ అల్పాహా రాన్ని వితరణగా అందజేశారు. కార్యక్రమములో పలువురు మానవతా సభ్యులు పాల్గొన్నారు.

# గరిష్ట చిల్లర ధర మించి మినరల్ వాటర్ విక్రయాలు అరికట్టాలి

### జిల్లా స్థాయి ధరల నిర్ధారణ మరియు పర్యవేక్షణ కమిటీ పర్యవేక్షణ చేయాలి

### కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య



ప్రజా భూమి, కడప సిటీ :

మినరల్ డ్రింకింగ్ వాటర్ను గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న రిటైల్ దుకాణ యజమానులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లసమావేశంలో మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగు నీటి అవసరం అధికంగా ఉన్న నేపథ్యంలోకొందరువ్యాపారులు వినియోగదారులను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీ ప్రకారం మాత్రమే మినరల్ వాటర్ విక్రయాలు జరగాలని ఆయన స్పష్టంచేశారు.వినియోగదారులప్రయోజనాలనుకాపాడేందుకు జిల్లా స్థాయి ధరల నిర్ధారణ మరియు పర్యవేక్షణ కమిటీ అన్ని వస్తువుల ధరలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కోరారు. ప్రస్తుతం తీవ్ర వేసవికారణంగా నీటి డిమాండ్ పెరిగినదృష్ట్యా, కొందరు దుకాణదారులు తమ ఇష్టానుసారం ధరలు పెంచి అమ్మకాలు నిర్వహించడం సరికాదన్నారు. ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునిధరలనునియంత్రించాలని ఆయనవిజ్ఞప్తి చేశారు. వినియోగదారులుకూడాఅప్రమత్తంగా ఉండి ఎంఆర్పీకి మించి ధరలు చెల్లించకుండా, అవసరమైతేసంబంధితఅధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# రేణిగుంట బాలిక ఉన్నత పాఠశాల తనదైన శైలిలో, 70 శాతం ఉత్తీర్ణత






ప్రజాభూమి ప్రతినిధులు రేణిగుంట.

రేణిగుంట మండలం లోని పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. మొత్తం 89 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 62 మంది ఉత్తీర్ణత సాధించి 70 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఈ ఫలితాల్లో 13 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. విద్యార్థినులు కె. చంద్రిక, కె. సల్మా 562 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, ఎస్. సమీర 554 మార్కులతో ద్వితీయ స్థానం, ఎస్. తబీషా 552 మార్కులతో తృతీయ స్థానం పొందారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థినులను, ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల అభినందించారు.

# గుర్తు తెలియని వృద్ధుడు మృతి..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి మండలం ఆగరాల గ్రామ పంచాయతి పరిధిలో తిరుపతి -- చిత్తూరు నేషనల్ హైవే 140 రోడ్డుకు దక్షణ దిశన ( బిట్స్) కాలేజ్ కాలేజీ వెనుక ధనమ్మ వారి వెస్ట్ ల్యాండ్, సుమారు 75 -- 80 సం,,లు వయసున్న గల మగ వృద్ధుడు చనిపోయి వుండి, శరీరము అంతయు పురుగులు పట్టి, కుళ్లిపోయి,దుర్వాసన వస్తు, ముఖము గుర్తు పట్టలేక, తెల్లని తెల్లని వెంట్రుకలు, కొద్దిగా మాసిన గడ్డము వున్నది. వ్యక్తి సుమారు 5-7 రోజులు క్రితము చనిపోయి అయి వుంటుంది. మృతుడిపైన నీలం, నలుపు, తెలుపు చెక్స్ డిజైన్ లుంగీ మాత్రమే ధరించి వున్నాడు. చంద్రగిరి మండలం, ఆగరాల సచివాలయము విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అయిన కార్వేటి విజయ్ కుమార్ వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చంద్రగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ వారి ఆదేశాల మేరకు ఎస్ ఐ మురళి మోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినారు. శవమును పోస్ట్-మార్టం పంపించి, మృతుడి బంధువులు ఎవరు రానందున బరియల్ చేయించినారు. మృతుడి గురించి ఎవరైనా ఆచూకీ తెలిసిన యాడల చంద్రగిరి పోలీస్స్టేషన్:9440796760, స్టేషన్:8919750750 ఫోన్ నెంబర్లకు సంప్రదించ వలసినదిగా కొరినారు.

# ప్రజాభూమి

జనరల్

శుక్రవారం, మే 01, 2026



# మహాత్మునికి మున్సిపల్ సిబ్బంది ఇచ్చే గౌరవం ఇదేనా

## మున్సిపల్ అధికారుల తీరు ను ఎండ గట్టిన వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

## ఏఈ తో సహా మున్సిపల్ సిబ్బందికి షోకాస్ నోటీసులు ఇవ్వమన్న చైర్మన్ రాఘవేంద్ర



జగ్గయ్యపేట, ప్రజాభూమి ప్రతినిధి

పట్టణంలోని కాకాని నగర్ లో మహాత్మా గాంధీ విగ్రహం తొలగింపు సందర్భంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించిన తీరు తీవ్ర ఆక్షేపణీయమని , జాతిపితగా దేశం మొత్తం ఆయనను గౌరవిస్తుంటే మున్సిపల్ అధికారులు మాత్రం ఆయన విగ్రహాన్ని తొలగించిన తీరు ఆ విగ్రహాన్ని ఉంచిన ప్రదేశం మహాత్ముని పై మున్సిపల్ సిబ్బందికి ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కౌన్సిల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కాకాని నగర్ గ్రంధాలయం పునరుద్ధరణ సంద ర్భంగా మహాత్మా గాంధీ విగ్రహాన్ని తొలగిం చే క్రమంలో ఆయన విగ్రహాన్ని సక్రమంగా తొలగించక పోవడమే కాక ఆ విగ్రహాన్ని చెత్తకుప్పల మధ్య ఉంచారని ఆయన వీడియోను మున్సిపల్ కౌన్సిల్లో చైర్మన్ తో సహా కౌన్సిల్ సభ్యులకు చూపించారు. జాతిపితగా యావత్ భారతదేశం మహాత్మునికి నీరాజనాలు పడుతుంటే మున్సిపల్ అధికారులకు మాత్రం ఆ మహాత్ముని పట్ల ఏమాత్రం గౌరవం లేదని ఇదేనా మున్సిపల్ సిబ్బంది మహాత్మునికి ఇచ్చే గౌరవం అంటూ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ నిలదీశారు. ఈ కౌన్సిల్ హయాంలో మహాత్మునికి ఇంతటి అవమానం జరగటం కౌన్సిల్ కు తలవంపులు తెచ్చేలా ఉందని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంజనీరింగ్ అధికారుల తీరును ప్రశ్నిస్తూ వైస్ చైర్మన్ చెప్పినా కూడా ఇంజనీరింగ్ సిబ్బంది పనులు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గాంధీ మహాత్ముని విలువ మీకు తెలుసా అంటూ డి ఈ శివ కోటేశ్వరరావు ,ఏఈలను ప్రశ్నించారు. మహాత్ముని విగ్రహం తొలగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అంశాన్ని పరిగణలోకి తీసుకోకపోవడమే కాక ఆ విగ్రహాన్ని పవిత్రంగా చూడాల్సిన బాధ్యత కూడా సిబ్బందిపై ఉందని మహాత్ముని విగ్రహం తొలగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ మరియు సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ తులసి వెంకట కృష్ణా రావును ఆదేశించారు. చెరువు బజారులో రోడ్డు పై మట్టి కుప్పలు ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ మట్టి కుప్పల ను తొలగించే అంశంపై సిబ్బంది నిర్లక్ష్యంపై చైర్మన్ రాఘవేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కనీసం ఇంగిత జ్ఞానం లేదా అంటూ తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.అలానే పట్టణ అభివృద్ధి పై కాంట్రాక్టర్లు డి ఈ తీరుతో తాము పనులు చేయలే కపోతున్నాం అని అంటున్నారని వర్క్ ఆర్డర్లు ఇవ్వకపోవడం ,పనులు పూర్తయిన వాటికి బిల్లులు చేయకపోవడంతో తాము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయని తాము ఆత్మహత్య చేసుకుంటే అందుకు డి ఈ నే కారణం అంటూ లేఖలు రాసి చనిపోతామని కాంట్రాక్టర్లు వాపోతున్నారంటూ డి ఈ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా శానిటేషన్ సిబ్బందిజీతాలు ఇవ్వకపోవడంపై చైర్మన్ రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎందుకు జీతాలు ఆపుతున్నారంటూ ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలోని గణాంక అధికారిని పిలిచి ఏఈ, డీఈ ల జీతాలను ఆపాలని సిబ్బంది జీతాలకు బిల్లులు పెట్టి నా కే వారికి జీతాలను మంజూరు చేయాలంటూ ఆదేశించారు. కౌన్సిల్లో రెండవ వార్డ్ కౌన్సిల్ సభ్యులు కొలగాని రాము కోదాడ రోడ్డు విస్తరణ పనుల పై వివరాలను కోరారు. ఆక్రమణల తొలగింపు రోడ్డు విస్తీర్ణం తదితర అంశాలను వివరించాలని కోరారు. అలానే పట్టణంలో ట్రాఫిక్ సమస్యను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసుల తీరును ఆక్షేపించారు. ఐదో వార్డు సభ్యులు వట్టెం మనోహర్ తన వార్డులో అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోచేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ గ్రాంటు లతో చేపట్టిన పనులపై కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని శాంతినగర్లో మున్సిపాలిటీకి చెందిన మూడు సెంట్ల స్థలం వేరే వారి పేరున రిజిస్ట్రేషన్ జరిగిందనే ప్రచారం జరుగుతోందని దీనిపై తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను చైర్మన్ రాఘవేంద్ర ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై చైర్మన్ రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విజయవాడ రోడ్డులో ఓ మున్సిపాలిటీ స్థలం ఆక్రమణలకు గురవుతోంది అంటూ పలువురు ఫిర్యాదులు చేస్తున్న ఆ సచివాలయ సిబ్బంది పట్టించుకోవడంలేదని అన్నారు. 2000 రూపాయల గౌరవ వేతనం తీసుకునే కౌన్సిలర్లే పట్టణ అభివృద్ధి పై ప్రశ్నిస్తుంటే వేలాది రూపాయల జీతాలు తీసుకునే మున్సిపల్ అధికారులు సిబ్బంది పట్టణం గురించి ఎందుకు పట్టించుకోరు అంటూ చైర్మన్ రాఘవేంద్ర ప్రశ్నించారు.

కౌన్సిల్ సభ్యులు పి రోశయ్య మాట్లాడుతూ తన వార్డులో పార్కును ప్రారంభించారని ప్రారంభోత్సవం అప్పుడు ఏర్పాటు చేసిన లైట్లు తర్వాత మున్సిపల్ సిబ్బంది తీసుకువెళ్లారని ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశామని చెబుతున్నారని అన్నారు. పార్కుకి వచ్చేపిల్లలు వృద్ధులకు ఏమన్నా వి ష కీటకాలు కుట్టిఏమన్నా జరగ రానిదిజరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు అంటూ ప్రశ్నించారు. ఇంజనీరింగ్ అధికారులు కొందరి పట్ల అభిమానం చూపుతున్నారని మరికొందరి పట్ల వివక్షత చూపుతున్నారంటూ ఆక్షేపించారు. కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు పట్టణంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేసి బాటసారు లకు మంచినీరు అందించాలని కోరారు.

## మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో సామినేని ఉదయభాను ప్రత్యేక పూజలు

గదుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట, ప్రజాభూమి ప్రతినిధి

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానాన్ని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగత ఏర్పాట్లను చేసి దర్శన అనంతరం , వేద ఆశీర్వచనాన్ని స్వామివారి ప్రసాదాలను అందించారు.అనంతరం దేవస్థాన ప్రాంగణంలోని మున్నూరు కాపు, నాయుడు అన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన గదులను సామినేని ఉదయభాను నేతలతో కలిసి ప్రారంభిం చారు.ఈ కార్యక్రమంలో మట్టపల్లి సర్పంచ్ రామిశెట్టి విజయశాంతి అప్పారావు , మున్నూరు కాపు నాయుడు అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షులు తోట వెంకయ్య నాయుడు , కమిటీ సభ్యులు మరియు స్థానిక పార్టీ నాయకులు, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదిలో నాగాయలంక బీసీ వసతి గృహ విద్యార్థుల జిల్లా స్థాయిలో ప్రభంజనం



నాగాయలంక /ప్రజాభూమి

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అవనిగడ్డ నియోజకవర్గం నాగాయలంక మండలం తలగడదివి బిసి సంక్షేమ బాలికల వసతి గృహ విద్యార్థునుల 99 శాతం ప్రతిభ సాధించారు. 575 మార్కుల తో తిరుమల శెట్టి సిరి చందన హాస్టల్స్ లోజిల్లా స్థాయి ప్రథమ స్థానం,తో పాటు మరో ఎనిమిది మంది కి 500కు పై బడి మొదటి స్థానం లో నిలిచారు. వీరితోపాటు మరో 9 మంది విద్యార్థులు 500లోపు గా మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు .మరో ముగ్గురు విద్యార్థినిలు ద్వితీయ స్థానంతో నిలబడ్డారు.మొత్తం 99శాతం ఫలితాలు సాదించడం పట్ల బాలికల సంక్షేమ శాఖ అధికా రిణి టి నాగమణి ని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి రమేష కృషిని జిల్లావ్యాప్తంగా మిగిలిన హాస్టల్ సంక్షేమ అధికారులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు .విద్యార్థులతో పాటు నాగ మణి ని అయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్య త్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు నాగమణి సూచించారు.



తిరుమల శెట్టి సిరి చందన575మార్కులు తో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని

## అక్షర శిఖరాగ్రాన బాలభాను ప్రభంజనం

**పదో తరగతి ఫలితాల్లో విజయకేతనం..**

**585 మార్కులతో ప్రణవ సూర్య, జోషిత టాప్**



జి ప్రణవ సూర్య



వి ఎన్ వి జోషిత

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

విద్యారంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్థానిక మాస్టర్ ఇ. కె. బాలభాను విద్యాల యము, 2026 పదో తరగతి ఫలితాల్లో తిరుగులేని విజయాన్ని సాధించి 'విజయదుందుభి' మోగిం చింది. పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో తమ ప్రతిభను చాటుకుని, మచిలీపట్నం ఖ్యాతిని పెంచారు. నక్షత్రాల్లా మెరిసిన టాపర్లుపాఠశాల విద్యార్థులు జి. ప్రణవ సూర్య, వి.ఎన్.వి జోషిత లు తమ అద్భుత ప్రతిభతో 585/600 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకు న్నారు. అలాగే ఎస్. అనూష, వి. రమ్యశ్రీ లు 577/600 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు.గణాంకాల్లో బాలభాను ఘనతఈ ఏడాది ఫలితాల్లో పాఠశాల సమష్టి కృషి స్పష్టంగా కనిపిస్తోంది550 పైగా మార్కులు: 18 మంది విద్యార్థులు. 500 – 549 మధ్య మార్కులు 18 మంది విద్యార్థులు.సబ్జెక్టుల వారీగా సెంచరీ (100/100) వీరులు తెలుగు: 12 మంది విద్యార్థులు.గణితం: 04 గురు విద్యార్థులు.సోషల్: 02 గురు విద్యార్థులు.అభినందనల జల్లుఈ ఘన విజయంపై పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివిన విద్యార్థులకు, వారికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల నిరంతర కృషి వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో మా విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం అనిపాఠశాల యాజమాన్యం తెలిపారుహైలైట్స్కూల్ టాపర్స్: 585 మార్కులు (ప్రణవ సూర్య, జోషిత).వందకు వంద: 18 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 100/100 సాధించారు.మెరుగైన ఫలితాలు: అత్యధిక శాతం విద్యార్థులు 500 పైగా మార్కులతో ఉత్తీర్ణత.

## కమ్మవారిపాలెంలో కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**గ్రామస్థులతో మమేకమై వైద్య సేవలపై ఆరా**

**శంకర్ ఐ హాస్పిటల్ సేవలకు ప్రశంసలు**

ప్రజాభూమి నందిగామ :

నందిగామ మండలం కమ్మవారిపాలెం గ్రామంలో గురువారం నాడు ఆర్.సి.యం చర్చి ఆవరణలో శంకర్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య శిబిరంలో చికిత్స పొందుతున్న గ్రామస్థులను పలకరిస్తూ, వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి నిపుణులైన వైద్యులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.అదేవిధంగా, అవసరమైన వారికి మెరుగైన చికిత్స అందేలా అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర సుభిక్షం కోసమే రాజశ్యామల, చండీ యాగాలు

ప్రజలందరూ పాడిపంటలతో వర్ధిల్లాలి

మంత్రి కొలుసు పార్థసారథి

కారకంపాడులో కన్నులపండువగా శివాలయ క్రతువులు



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

లోక కల్యాణం కోసం, రాష్ట్రం పాడిపంటలతో తులతూగాలని సంకల్పిస్తూ కృష్ణాజిల్లా మొవ్వ మండలం కారకంపాడులో మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం తన స్వగ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీముఖ లింగేశ్వర ఆలయ యాగశాల వద్ద మంత్రి విలేకరులతో మాట్లాడారు.ప్రధాన ముఖ్యాంశాలుఆగమ శాస్త్రం ప్రకారం గత నాలుగు రోజులుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్‌ల కృషితో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని, వారికి ఈశ్వరుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుతూ రాజశ్యామల యాగం, చండీయాగం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ సంకల్పం - దైవ ఆశీస్సులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత లోకేష్‌లకు భగవంతుడు మరింత శక్తి సామర్థ్యాలను ప్రసాదించాలని మంత్రి ఆకాంక్షించారు.యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించాలని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. ఆ సంకల్పం నెరవేరాలని నేడు ప్రత్యేక పూజలు నిర్వహించాం అని కొలుసు పార్థసారథి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి తెలిపారు.గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఈ ఆలయంలో లోక క్షేమం కోసం జరుగుతున్న ఈ యాగాల్లో మంత్రి దంపతులు పాల్గొని సంకల్పం చెప్పుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యంగా యువతకు మంచి భవిష్యత్తు లభించాలని ఈ యాగాల ద్వారా శివుని ప్రార్థించినట్లు మంత్రి వివరించారు.

## మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి ప్రజాభూమి వార్షికోత్సవ డైరీ అందజేత



మచిలీపట్నం /ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని ప్రజాభూమి కృష్ణా జిల్లా బ్యూరో అనంత సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని ఎంపీ నివాసంలో జరిగిన ఈ భేటీలో, ప్రజాభూమి వార్షికోత్సవ ప్రత్యేక డైరీని ఆయనకు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలికితీయడంలో, సమాజానికి నిష్పక్షపాతమైన సమాచారాన్ని అందించడంలో ప్రజాభూమి పత్రిక తనదైన ముద్ర వేస్తోందని అభినందించారు. వార్షికోత్సవ డైరీ రూపకల్పన చాలా బాగుందని పేర్కొంటూ, పత్రిక యాజమాన్యానికి మరియు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా స్కూల్ రెడీనెస్ మేళ



ప్రజాభూమి నందిగామ :

చందర్లపాడు మండలం, చందర్లపాడు గ్రామం, చందర్లపాడు సెక్టార్ పరిధిలోని స్థానిక అంగన్వాడి కేంద్రంలో గురువారం స్కూల్ రెడీనెస్ మేళ అత్యంత ఉత్సాహకరంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలత గారు మాట్లాడుతూ అంగన్వాడి యొక్క విశిష్టతను తెలుపుతూ మూడు సంవత్సరముల నుండి ఐదు సంవత్సరాలు నిండిన అంగన్వాడి పిల్లలను ప్రైమరీ పాఠశాల విద్య కొరకు సిద్ధం చేయడమే లక్ష్యంగా భావిస్తున్నామని తెలియజేస్తూ ప్రీ స్కూల్ పిల్లలకు సర్టిఫికెట్స్ అందించి వారిని ప్రైమరీ స్కూల్ లో జాయిన్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో గౌరవనీయులు ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు రామారావు,పద్మ ,నందిగామ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సూపర్వై జర్ శ్రీలత అంగన్వాడి వర్కర్స్ దుర్గాంబ, పి నిర్మల, పద్మ తల్లులు తండ్రులు పిల్లలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బందరుకు పట్టాభి మకుటం.. స్మారక భవనానికి ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం చారిత్రక వైభవానికి మరో కలికితురాయి చేరనుంది. భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి. జిల్లా కోర్టు సెంటర్ సమీపంలోని 2 ఎకరాల స్థలంలో ఈ భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులను నేడు జరిగిన ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ సమావేశంలో ఆమోదించారు.అడ్డంకులు తొలగించిన కూటమి ప్రభుత్వంగత ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల జారీలో తీవ్ర జాప్యం జరిగిందని, ఉద్దేశపూర్వకంగానే ప్రాజెక్టును అడ్డుకున్నారని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చొరవతో అనుమతులు లభించడంతో త్వరలోనే మొదటి దశ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.జిల్లా కోర్టు సెంటర్, మచిలీపట్నం (2 ఎకరాల విస్తీర్ణం).మొదటి దశ నిర్మాణానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పటికే రూ. 6.5 కోట్లు మంజూరు చేసింది. అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు,ఎంపీ బాలశౌరి పార్లమెంట్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.బందరుకు తలమానికంగా నిర్మాణం..డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య కీర్తిని దశదిశలా చాటేలా, బందరు నడిబొడ్డున ఈ స్మారక భవనాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తాం. ఇది మచిలీపట్నానికి తలమానికంగా నిలుస్తుంది అని ఎంపీ బాలసౌరి తెలిపారు ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం పట్ల బందరు వాసులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల ఘనవిజయం

### పది ఫలితాల్లో 94 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటిన కృష్ణా జిల్లా విద్యార్థులు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

నేడు విడుదలైన పదవ తరగతి ఫలితాలలో కృష్ణా జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ ప్రోత్సాహం, అధికారుల పర్యవేక్షణ తోడవ్వడంతో హాస్టల్ విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ర్యాంకులు సాధించి అందరి ప్రశంసలు అందు కుం టున్నారు. ఈ ఫలితాలపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కె. షాహిద్ బాబు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ప్రకటన విడు దల చేశారు.ఫలితాల విశ్లేషణమొత్తం హాజరు: 14 4 మంది విద్యార్థులు.ఉత్తీర్ణత: 135 మంది (94% ఉత్తీర్ణత).



శతశాతం విజయం: జిల్లాలోని మొత్తం 22 వసతి గృహాలకు గాను 17 వసతిగృహాలు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం.మెరిట్ స్కోరు: 19 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి మెరుగైన ప్రతిభ కనబరిచారు.జిల్లా స్థాయిలో మెరిసిన ఆణిముత్యాలువసతిగృహాల్లో ఉంటూ క్రమశిక్షణతో చదివి జిల్లా స్థాయిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి ర్యాంకు విద్యార్థి పేరు వసతి గృహం మార్కులు (600 కి)ప్రథమ పోనుగుమాటి హాసిని బాలికల వసతి గృహం, నాగాయలంక 591ద్వితీయ కొక్కిలిగడ్డ ఝాన్సీ బాలికల వసతి గృహం, కోడూరు 573తృతీయ కాలి రోహిత్ బాలుర వసతి గృహం నందివాడ "విద్యార్థుల కష్టం, ఉపాధ్యాయుల కృషి, అధికారుల నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. 17 వసతిగృహాలు నూరు శాతం ఫలితాలు సాధించడం గర్వకారణం. విజేతలందరికీ అభినందనలు తెలియజేసిన—ఎస్.కె. షాహిద్ బాబు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ.ఈ అద్భుత విజయం సాధించిన విద్యార్థులను, వారికి వెన్నుదన్నుగా నిలిచిన వార్డెన్లు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులను శాఖా పరంగా అధికారులు అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు.



పోనుగుమాటి హాసిని-591



కొక్కిలిగడ్డ_ఝాన్సీ_573



కాలి_రోహిత్_571

Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,opsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

# డైనా (స్నైపర్) డాగ్‌తో 24 గంటల్లో హత్యాయత్నం కేసు ఛేదన..నిందితుడు అరెస్ట్

## డీఎస్పీ బి. మురళి నాయక్



ప్రజాభూమి ప్రతినిధి-వేంపల్లె

వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలంలో జరిగిన హత్యాయత్నం కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. జిల్లా ఎస్పీ. నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ బి. మురళి నాయక్ పర్యవేక్షణలో వేంపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహులు మరియు సిట్ ఇన్‌స్పెక్టర్లు తాయార్ హుస్సేన్, ఇ. తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం వేగంగా దర్యాప్తు చేపట్టింది. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామం హరిజనవాడకు చెందిన దాసిగాళ్ల సుబ్బమ్మ ఈ నెల 29వ తేదీ అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో తన ఇంటి ముందర నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి పలుమార్లు పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. డయల్-112కు సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, నేరస్థలాన్ని భద్రపరిచారు. క్లూస్ లేని ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను వినియోగించారు. డాగ్ స్క్వాడ్‌కు చెందిన డైనా (స్నైపర్) నిందితుడు ఉపయోగించిన డోర్ మ్యాట్ వాసన ఆధారంగా నేరస్థుడు వెళ్లిన మార్గాన్ని అనుసరిస్తూ నేరుగా అతని ఇంటి వద్దకు చేరింది. అనంతరం ఇంట్లో బట్టలు మార్చిన ప్రదేశం వద్ద ఆగి కీలక ఆధారాలు అందించింది. ఈ ఆధారాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి, ఏప్రిల్ 30 ఉదయం సుమారు 9.30 గంటలకు రామిరెడ్డిపల్లి బైపాస్ రోడ్డుపై అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన నిందితుడు ఎర్రఓబిగళ్ళ చంద్రయ్య (49), వృత్తి: రైతు కూలీ. బాధితురాలితో గత ఐదు సంవత్సరాలుగా ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇటీవల ఆమె అతన్ని దూరంగా ఉంచడంతో ఆగ్రహానికి గురై ఈ హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ, ఎస్సైలు మరియు డాగ్ స్క్వాడ్ సిబ్బంది పి. సునీల్ కుమార్ (హెడ్ కానిస్టేబుల్), పీసీ మాబుసేన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. నేరాలు జరిగిన ప్పుడు ప్రజలు నేరస్థలాన్ని చెదరగొట్టకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ నందగోకుల రాధాకృష్ణ దేవాలయం 9వ వార్షికోత్సవం.

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

స్థానిక శ్రీ నందగోపాల రాధాకృష్ణ దేవాలయం తొమ్మిదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు తొమ్మిదవ వార్షికోత్స వం సందర్భంగా గురువారం ఉదయం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ పురోహితుడు అని పెద్ది రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రభాత సేవ అనంతరం రాధాకృష్ణులకు అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శేషాద్రి కోలాట భజన మండలి వారిచే హనుమాన్ చాలీసా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దైవ దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్తలు కూచిపూడి రామకృష్ణ, నాగమణి దంపతులు ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిపించారు.

# మహిళల భద్రత ... మనందరి బాధ్యత

## ఆర్కే వ్యాలీ సి.ఐ సి.శంకర్ రెడ్డి




పులివెందుల

మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, భద్రతా చర్యలపై వేముల జెడ్పీ హైస్కూల్ లో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపియస్ ఆదేశాల మేరకు మహిళల పై నేరాల నివారణ కు, మహిళలకు విస్తృత అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పోలీసు లో భాగంగా " మీ రక్షణ - మా బాధ్యత" పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు, రెవిన్యూ అధికారులు,ఐ. సి.డి.ఎస్, ఇతర అధికారులు పాల్గొని మహిళలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆర్కే వ్యాలీ సి.ఐ సి. శంకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని,ఆపద సమయం లో భయం వీడి పోలీసులను సంప్రదించాలని కోరారు.వేధింపులు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.సామాజికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.వేముల మండల తహసీల్దార్ టి.లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్ ఇతర భద్రతా చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు.ఆపదలో ఉన్నప్పుడు డయల్ 112 లేదా డయల్ 100 లేదా శక్తి యాప్‌ను వినియోగిం చు కోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వేముల పీ.ఎస్ ఎస్సై పి. ప్రవీణ్ కుమార్, ఆర్కే వ్యాలీ ఎస్.ఐ బి.శ్రీప్రి య, కడప మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ శ్రీనివాసులు, వెలుగు ఏ.పీ.ఎం డి.ఆంజనే యులు , సి.సి జె.జ్యోతి, పెద్ద జూటూరు జి.ఎం.ఎస్కె వై.రాధ, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీసెర్చ్ సెంటర్లుగా యూనివర్సిటీలు

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- టెక్నాలజీ కాంపిటెన్సీ వచ్చేలా విద్యార్థులకు శిక్షణ
- రాష్ట్ర యువతకు అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ నైపుణ్యాలు
- ఉద్యోగాల కల్పనపై సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం
- పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలు తెస్తున్నామన్న మంత్రి లోకేష్




ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా వివిధ కోర్సులు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని సీఎం సూచనలు చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధిపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తోన్న కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. గేమ్ చేంజర్‌లుగా మారనున్న లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ లాంటి రంగాల్లోనూ కొత్త కోర్సులు రావాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా ఈ కోర్సులు రావాల్సిన అవసరముందన్నారు. క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రంలో మొట్ట మొదటగా కోర్సును ప్రారంభించటంపై ఆంధ్రా యూనివర్సిటీని సీఎం అభినందించారు. ఏపీలోని విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయంగా పోటీ పడాలని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ 200 యూనివర్సిటీలతో భాగస్వామ్యాలు కుదుర్చుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ యూనివర్సిటీకి ఏదో ఒక పారిశ్రామిక సంస్థ అనుసంధానమై ఉండేలా చూడాలని సూచనలు చేశారు. యూనివర్సిటీల్లో జర్మన్ సహా వివిధ విదేశీ భాషల్లో శిక్షణ కోసం ఓ విభాగం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను అందిపుచ్చుకునేలా ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకూ వివిధ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు కెరీర్ బిల్డింగ్, కేరక్టర్ బిల్డింగ్ జరిగేలా ఉండాలన్నారు. ఆరోగ్యం, టెక్నాలజీతో పాటు బెస్ట్ ప్రాక్టీసెస్‌ను నేర్పించేలా ఈ పాఠ్యాంశాలు ఉండాలని సూచించారు. దీని కోసం ఐఐటీ చెన్నై సహా వివిధ ప్రతిష్టాత్మక సంస్థల నుంచి సిఫార్సులు తీసుకుని విద్యాశాఖలో అమలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యూనివర్సిటీ రికార్డులను కూడా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్రంలో వివిధ ప్రతిష్టాత్మక సంస్థలు లాజిస్టిక్స్, ఏవియేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.

### త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్

విద్యార్థులకు అన్ని పోషకాలూ అందేలా మధ్యాహ్న భోజన మెనూను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థుల మానసిక, భౌతిక ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లీప్ యాప్ ద్వారా తల్లితండ్రులు కూడా విద్యార్థుల హాజరు, వారి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా అత్యుత్తమ టీచర్లతో వీడియో మాధ్యమంలో పాఠాలు చెప్పిస్తే బోధనలో నాణ్యత పెరుగుతుందని సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనూ సాంకేతికతతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పీ4 లాంటి కార్యక్రమాలను అనుసంధానం చేసుకుని మౌలిక సదుపాయలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు కొత్త ఆలోచనలు వచ్చేలా విద్యార్థులతో ఓ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించాలని స్పష్టం చేశారు. దానికి స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ గా పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఆటిజం సహా దివ్యాంగ విద్యార్థులకు విద్యాబోధనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్రీడలతో పాటు మానసికోల్లాసానికి కో-కరిక్యులర్ యాక్టివిటీస్ ను పెంచాలని అన్నారు. ఇంటర్ లో విద్యార్థులకు వివిధ కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులో ఉండేలా చూడాలని దీనిపై అధ్యాపకులకు కూడా రీఓరియంటేషన్ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో టెక్నాలజీ కాంపీటెన్సీ పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం ద్వారా పరిశుభ్రతా అంశాలపై విద్యార్థుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయన్నది అధ్యయనం చేయాలన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

### నైపుణ్యాలపై ర్యాండమ్ స్కిల్ ఆడిట్

రాష్ట్రంలోని యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఏమేరకు నైపుణ్యాలు కలిగి ఉన్నారో ర్యాండమ్ స్కిల్ ఆడిట్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. ఈ విషయంలో ప్రపంచ స్థాయి అత్యుత్తమ నైపుణ్యాలు మన యువతకు అందేలా చేయాలని.. దీని కోసం ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలతో అనుసంధానం చేసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేసేందుకు స్కిల్ గ్యాప్ అడ్వైజర్లను ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. తద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు మెరుగవటంతో పాటు ఆర్థిక లావాదేవీలు పెద్ద ఎత్తున జరుగుతాయన్నారు. పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో అభివృద్ధి చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ లు ఇంజనీరింగ్ కళాశాలల ద్వారా ఎనర్జీ, లాజిస్టిక్స్, క్వాంటం, ఏఐ లాంటి రంగాల్లో నైపుణ్యాలు పెరగాలని స్పష్టం చేశారు. దీంతో పాటు జిల్లాల వారీగా స్కిల్ మ్యాప్ తయారు చేయటం ద్వారా ఏ ప్రాంతంలో ఎంతమంది నిపుణుల లభ్యత ఉందనేది తెలియచేసే అవకాశముందన్నారు. గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకూ 7 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయని.. స్వయం ఉపాధితో పాటు ఎంఎస్ఎంఈల ద్వారా కూడా ఉపాధి వచ్చిందన్నారు. వివిధ శాఖల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చిన వివరాలను ఓ సమీకృత పోర్టల్ ద్వారా సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. త్వరలోనే నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను వెల్లడించాలని సూచించారు.

### అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు: మంత్రి లోకేష్

రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో రీస్ట్రక్చర్ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. సమీక్షలో భాగంగా విద్యాశాఖలో చేపడుతున్న విప్లవాత్మక సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు. వన్ క్లాస్ వన్ టీచర్ పాఠశాలలను పెంచేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఎన్ రోల్ మెంట్ ను కూడా పెంచుతున్నామని వివరించారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ పాఠ్యాంశాలను మార్పు చేయటంతో పాటు బ్రిడ్జి కోర్సులు కూడా విద్యార్థులకు అందిస్తున్నామని తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ ఎన్సీఆర్టీ సహకారంతో పాఠ్యాంశాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పు చేస్తున్నట్టు తెలిపారు. బోధనా మాధ్యమాలను అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఫిన్ ల్యాండ్ లాంటి దేశాలకు పంపుతున్నట్టు సీఎంకు తెలియచేశారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరరీలో ఏపీని అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని మంత్రి వివరించారు. టీచర్ - స్టూడెంట్- అవుట్ కమ్ అనే విధానంలో విద్య శాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. బడికోసం పేరిట మౌలిక సదుపాయాలను కల్పించటంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రికి తెలియచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాలేజీ అవర్స్ ను పెంచి విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేలా శిక్షణ ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఫలితాలు మెరుగయ్యేలా ఇంటర్ సప్లిమెంటరీ రాసుకునేందుకు విద్యార్థులకు వెసులుబాటు కల్పించామని తెలియచేశారు. నైపుణ్యాభివృద్ధి కల్పనలో భాగంగా అందరికీ స్కిల్ అసెస్మెంట్ చేస్తున్నామన్నారు. ఈ సమీక్షకు పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## శ్రీ ఆదిత్య పాఠశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



ప్రజాభూమి ప్రతినిధి-ఏటపాక

తోటపల్లి గ్రామంలోని శ్రీ ఆదిత్య పాఠశాల విద్యార్థులు నేడు విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో విజయ ఉత్తమ ప్రతిభ కనపరచి విజయకేతనం ప్రదర్శించడంతో పాఠశాల యాజమాన్యం కడియాల వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ హర్షం వ్యక్తం చేశారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 17మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ముదిగొండ జస్వంత్ 558 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలవగా 549 మార్కులు సాధించి గొల్లపల్లి సాహిత్య రెండవ స్థానంలో నిలవడం ,524 మార్కులు సాధించి కె రోహన్ సాత్విక్ మూడో స్థానంలో నిలిచారన్నారు. పాఠశాల ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత ద్వారా పాఠశాల ఖ్యాతిని మరింత పెంచడం జరిగిందని ఆయన తెలియచేశారు.ఇందులో భాగంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానించారు. తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మల్లిక, ప్రసన్న, నాగేంద్రమ్మ , నమ్రత, శివాని, శ్రీనివాసరావు, జయంతి విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలలో బాలికలదేపై చేయి.

-మండల విద్యాశాఖాధికారి తెల్లం బాబురావు.




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

పది పరీక్షాఫలితాలలో మండలంలో బాలికలే అత్యుత్తమ ఫలితాలు సాధించారని మండల విద్యాశాఖాధికారి తెల్లం బాబురావు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం బాబురావు మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలం నుండి 677 మంది హాజరు కాగా 517 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. వీరిలో 233 మంది బాలురు హాజరు కాగా 167 మంది( 71 శాతం ) ఉత్తీర్ణత పొందారని, 369 మంది బాలికలు హాజరు కాగా 302 మంది( 83% ) ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 74.7%, ప్రైవేట్ పాఠశాలల్లో 97% విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో బుట్టాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టీ.జైపాల్ 562 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యారోహిణి పాఠశాల విద్యార్థిని టీ.జాహ్నవి 587 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందిని, విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు తెల్లం బాబురావు, సిహెచ్ నరేంద్ర రాయ్ అభినందించారు.

## జర్నలిస్ట్ లకు రక్షణకు పటిష్టమైన చట్టాలు అవసరం.

నేషనల్ హ్యూమన్ రైట్స్, యాంటీ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ నడపాల సోమరాజు డిమాండ్.

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

జర్నలిస్ట్‌ల రక్షణకు పటిష్టమైన చట్టాలను చేయాలని, జర్నలిస్ట్ లపై దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ నడపాల సోమరాజు కోరారు. స్థానిక విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ నిన్న చిత్తూరు జిల్లా,ఎ.కోట ఆంధ్రజ్యోతి విలేఖరి మాఫియా చేతుల్లో దారుణ హత్య, అంతకు ముందు అనంతపురంలో గంజాయి మాఫియా చేతుల్లో పెంచలయ్య దారుణ హత్య, నేడు సాలూరులో మరో జర్నలిస్ట్ పై దాడి చేసి గాయపరచడం ఇవన్నీ చూస్తుంటే జర్నలిస్ట్ ల రక్షణ కోసం సరైన చట్టం లేకపోవడం వల్లనే మాఫియాలు రెచ్చిపోయి సామాజిక కార్యకర్తలు,జర్నలిస్ట్ లను హత్య చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న సంఘటనలు రాష్ట్రంలో పెరుగుతున్న నేర రాజకీయాలకి,అధికార యంత్రాంగం వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమన్నారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన పత్రికారంగంపై దాడి జరగడం అంటే, ప్రజల గళాన్ని మూయించే కుట్రని,మాఫియా శక్తులు ఈ స్థాయిలో దుస్సాహసం చేయడానికి కారణం పాలకుల నిర్లక్ష్యం, నేరస్తులకు లభిస్తున్న రాజకీయ ఆశ్రయం అన్నారు.ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి,నిందితులను అరెస్ట్ చేసి,ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలిని,అలాగే ఈ కేసులో ఉన్న రాజకీయ సంబంధాలపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని కోరారు.ఈ ఘటనలపై మౌనంగా ఉండమని, బాధ్యులపై కఠనచర్యలు తీసుకునే వరకు ప్రజలతో కలిసి నిరసనలు కొనసాగిస్తామని అన్నారు.

## తాడి ప్రజల ఆవేదన అర్థం చేసుకోండి

బీజెపి నాయకురాలు మడక పార్వతి రమేష్

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి



గత 20 సంవత్సరాలుగా తమ గ్రామాన్ని తరలించాలంటూ ఎన్నో పోరాటాలు చేస్తున్న తాడి ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవాలని బీజెపి నాయకురాలు మడక పార్వతి రమేష్ అన్నారు. ఫార్మా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీని వారు విన్నవించుకుంటున్న ఫలితం లేకపోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చొరవతో తాడి తర లింపు పై కదలిక మొదలైందని, అయితే ఇంకా తరలింపు పూర్తి అవ్వకుండా రాంకీ యాజమాన్యానికి రెండవ ల్యాండ్ ఫీల్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నా రు. ముఖ్యంగా తాడి ప్రజలు ప్రధానంగా తమ గ్రామాన్ని తరలించాలని డిమాండ్ తెరపైకి తీసుకువస్తున్నారు కాబట్టి తాడి గ్రామాన్ని తరలించిన తర్వాతే రాంకీ రెండవ ల్యాండ్ ఫిల్ పనులను ప్రారంభించాలని ఈ సందర్భం గా కోరారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి తద్వారా ప్రజలకు ఉపాధికి అవకా శాలు కల్పించాలని అధికారంలోకి వచ్చినప్పటి నుండి పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తుం దని ఆమె తెలిపారు. ముఖ్యంగా స్థానిక ఎంపీ సీఎం రమేష్ అనకాపల్లి జిల్లాని రాష్ట్రంలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఇప్పటికే కేంద్ర సహకారంతో ఎన్నో పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం జరిగింద ని అన్నారు. అయితే పరిశ్రమల నెలకొల్పడం వలన ప్రజలు నిరాశ్రయులు అవకూడదని, అదేవిధంగా కాలుష్యంతో ఇబ్బంది పడకూడద ని అని అన్నారు. అందువలన విపరీతమైన గా లి మరియు నీటి కాలుష్యానికి అవకాశం ఉండే ల్యాండ్ ఫీల్ నిర్మాణం చేపట్టకు ముందే తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిం చాలని ఆమె ప్రభుత్వానికి విన్నవించారు.

# విద్యావంతుడి నాయకత్వంలో వెలుగొందుతున్న విద్యావ్యవస్థ

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం
- విద్యాశాఖలో మంత్రి నారా లోకేష్ సంస్కరణల విజయకేతనం
- గతేడాది 81.1 శాతం నుంచి 85.25 శాతం నమోదు
- విద్యాశాఖలో విజయాలు లోకేష్ కృషికి నిదర్శనం
- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి**

ఒక విద్యావంతుడైన నాయకుడు విద్యాశాఖ బాధ్యతలు చేపడితే ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో నేటి పదో తరగతి ఫలితాలు నిరూపిస్తున్నాయని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. నేడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ విజయం వెనుక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అంకితభావం, వినూత్న సంస్కరణలు ఉన్నాయని స్పష్టం చేశారు.. నేడు విడుదలైన ఫలితాలు కేవలం విద్యార్థుల కష్టమే కాకుండా, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ గత రెండేళ్లుగా విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టిన వినూత్న మార్పులకు, సమూల సంస్కరణలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

**గణనీయంగా పెరిగిన ఉత్తీర్ణత శాతం**

గత ప్రభుత్వ పాలనలో 2022 నాటికి 67.26 శాతానికి పడిపోయిన ఉత్తీర్ణతను, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే 85.25 శాతానికి చేర్చడం ఒక చారిత్రాత్మక విజయమని శ్రీనివాసులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఉత్తీర్ణత గత ఏడాది 72.8 శాతం ఉండగా, ఈసారి అది 78.39 శాతానికి పెరగడం పేదరిక నిర్మూలనకు తొలి ప్రయత్నం మాత్రమే కాకుండా ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందన్నారు.

**బాలికల విద్యకు ప్రాధాన్యత - సంక్షేమ పథకాల ప్రభావం**

మంత్రి లోకేష్ నాయకత్వంలో బాలికల



విద్యకు పెద్దపీట వేయడం వల్ల వారు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించి, బాలుర కంటే 5.22 శాతం ముందున్నారని వివరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ 96.04 శాతం ఫలితాలతో రికార్డు సృష్టించాయన్నారు. "సూపర్ సిక్స్" హామీలో భాగంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం ద్వారా అందుతున్న రూ.15,000 ఆర్థిక సాయం, బడి మానేసే వారి సంఖ్యను తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచిందని తెలిపారు.

**విప్లవాత్మక మార్పులు**

రాష్ట్రవ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, ఒక తరగతికి ఒక టీచర్ విధానం, దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన "మెగా పీటీఎం" విద్యా ప్రమాణాలను గాడిన పెట్టాయన్నారు. రాజకీయాలకు తావులేకుండా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి పేరుతో విద్యా కిట్లు, చీజజు=ౖ కరిక్యులమ్, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ వంటి మహనీయుల పేర్లను తొలగించారని గుర్తు చేశారు. చివరకు చిన్న పిల్లలకు ఇచ్చే చిక్కీలపై కూడా సొంత ఫోటోలు వేసుకున్న సంస్కృతి జగన్మోహన్ రెడ్డిదే అని మండిపడ్డారు. విద్యావంతుడైన లోకేష్ గారు విద్యాశాఖను ఒక సవాలుగా తీసుకుని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో మార్పునకు విద్యే అసలైన మార్గమని భావిస్తూ, విద్యార్థులందరూ శ్రీశ్రీ గారి ఆశయాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి విజయాలు సాధించాలని కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## పది ఫలితాలలో నారాయణ టౌన్ ఫస్ట్.




**ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు**

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నిడదవోలు నారాయణ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, వరుసగా మూడవ సంవత్సరం కూడా 'టౌన్ ఫస్ట్' సాధించి హ్యాట్రిక్ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా 600 మార్కులకు గానూ 596 మార్కులు సాధించిన పెదిరెడ్ల మధు శరణ్య (2609119422), రంగ జేతశ్రీ శుభ శివాని (2609119356)లను సంస్థ డి.జి.ఎం. రామిరెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ ఆకుల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ విజయం అందరి కృషితో సాధ్యమైందని పేర్కొన్నారు. అలాగే 589 మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను క్లస్టర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ సత్కరించగా, 500 పైచిలుకు మార్కులు సాధించిన 26 మంది విద్యార్థులను కో-ఆర్డినేటర్ కిరణ్ ప్రత్యేకంగా అభినందించారు. 100 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులందరినీ ఉపాధ్యాయ బృందంతో పాటు డీన్ మునీశ్వర్, 10వ తరగతి ఇంచార్జి ఉమామహేశ్వర్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అనంతపురము



**ప్రజా భూమి ప్రతినిధి-అనంతపురం**

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ చైర్మన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అనంతపురం వారి ఉత్తర్వుల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, అనంతపురం వారు 28వ తేదీన రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ ఫుట్బాల్ కాంపిటీషన్స్ ను స్థానిక ఆర్డిటి స్టేడియం అనంతపురం నందు ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ పోటీలు 28 వ నుండి 30 వ తేదీ వరకు జరుగును. గురువారం జరిగినటువంటి శాప్ లీగ్ ఫుట్బాల్ కాంపిటీషన్ను "జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, వీక్షించడం జరిగింది. ఏలూరు ఖా కృష్ణ జట్ల శాప్ లిగ్ రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ పోటీలను ప్రారంభించడం జరిగింది. శాప్ లిగ్ రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ ముగింపు వేడుకలకు "అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక జి. లక్ష్మీనారాయణ వాల్మీకి" ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. ముఖ్యఅతిథి వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ షాప్ లీగ్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ శాప్ లీగ్ క్రీడా పోటీలను ప్రతి ఒక క్రీడాకారుడు ఉపయోగించుకొని ప్రతిభను కనబరిచావలసినదిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో కె. జగన్నాథ్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్, కడప వారు, శ్రీ ఎం ఎస్ వి రాజు, డి.ఎస్.డి.ఒ నంద్యాల వారు, ఎస్ఎం మంజుల, డి.ఎస్.డి.ఒ. అనంతపురం వారు, శ్రీ బి. కిషోర్, డి.ఎస్.డి.ఒ. శ్రీ సత్య సాయి జిల్లా వారు. సురేంద్రబాబు ఎస్ ఓ, శ్రీ జగన్మోహన్ రావు, డి.ఎస్.డి.ఒ. ఏ ఎస్ ఆర్, పాడేరు. ఎస్ జి ఎఫ్ బాయ్స్ సెక్రెటరీ వారు. నరసింహులు, ఆరోగ్య శాఖ, అనంతపురము వారు, మరియు శిక్షకులు సిబ్బంది పాల్గొనడం జరిగింది. మరియు శాప్ లిగ్ రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ విజితల వివరములు క్రింది వెంట జతచేయదమైనది.

## ఘనంగా టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ పుట్టిన రోజు వేడుకలు



**ప్రజా భూమి ప్రతినిధి-వేంపల్లె**

గురువారం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్ పుట్టిన రోజు వేడుకలు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి, కేక్ తినిపిస్తూ శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహమ్మద్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, గండి దేవస్థానం చైర్మన్ వెంకటస్వామి, టిడిపి మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, దక్క రమేష్, మదక శ్రీను, పూల భక్షు, ఎద్దుల రాము, మల్లికార్జున, వెంకట్రామిరెడ్డి, ఇస్మాయిల్, బాబు, వెంకటశివ, జబీబుల్లా, శివ, రమణ, ఇలియాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు అండగా పేర్ని కిట్టు.. ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శ

**ప్రజా భూమి ప్రతినిధి-మచిలీపట్నం**



మచిలీపట్నం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలియతిరుగుతూ, చికిత్స పొందుతున్న రోగులను వ్యక్తిగతంగా పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రోగులకు అందుతున్న వైద్యం, మందుల సరఫరా మరియు డాక్టర్ల అందుబాటు గురించి పేర్ని కిట్టు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న వారితో ఆప్యాయంగా మాట్లాడి, మేమున్నాం.. అధైర్య పడకండి అంటూ భరోసా ఇచ్చారు. ఆసుపత్రిలో పారిశుధ్యం మరియు రోగులకు అందుతున్న కనీస వసతులపై అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందాలి అని తెలిపారు. ఈ పర్యటనలో పేర్ని కృష్ణమూర్తి వెంట స్థానిక వైసిపి నాయకులు, కార్పొరేటర్లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. రోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.

# విద్య జీవితాన్ని మలిచే మహాశక్తి

## 10వ తరగతి విద్యార్థులకు అభినందనలు తెలిపిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**ప్రజా భూమి ప్రతినిధి-అమరావతి**

రాష్ట్రంలో నిర్వహించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో, విద్యార్థులు కష్టపడి సాధించిన ఈ విజయమే వారి భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. "విద్య అనేది జీవితాన్ని మలిచే శక్తి. ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని, ఉన్నత లక్ష్యాల వైపు కృషి చేయాలి" అని సూచించారు.



పరీక్షల్లో విజయం ఒక ముఖ్యమైన మైలురాయి మాత్రమేనని, ఉన్నత విద్యలో ఇంకా పెద్ద విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

అలాగే, ఆశించిన ఫలితాలు రాని విద్యార్థులు నిరుత్సాహపడవద్దని, ఇది కేవలం ఒక దశ మాత్రమేనని అన్నారు. మరింత కృషి, పట్టుదలతో భవిష్యత్తులో విజయాన్ని సాధించవచ్చని ప్రోత్సహించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ మరోసారి అభినందనలు తెలిపారు.

## పమిడిముక్కలలో సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

**ప్రజాభూమి బ్యూరో-కృష్ణాజిల్లా**

పామర్రు,కృష్ణా జిల్లా పమిడిముక్కలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను ఘన విజయం చేయాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. పమిడిముక్కల మండలం వీరంకిలాకు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మరియు అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు తాగునీరు, మజ్జిగ, ఆహారం మరియు రవాణా సదుపాయాల్లో ఎలాంటి లోటు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని సూచించారు.

**లబ్ధిదారులకు నేరుగా పెన్షన్ల అందజేత.**

మేడే వేడుకలు: కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో భేటీ. గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం. 20 లక్షల ఉద్యోగాల కల్పన, పరిశ్రమల పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తున్నాం మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు

**ప్రభుత్వ ప్రాధాన్యతలు**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 64 లక్షల మందికి పెన్షన్ల పంపిణీ. సూపర్ సిక్స్ పథకాల సమర్థవంతమైన అమలు. బ్రాండ్ ఏపీ నినాదంతో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి, రాష్ట్ర ప్రగతికి కట్టుబడి ఉందని, ఈ పర్యటన ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# పోలాటితిప్పలో భక్తిప్రపత్తులతో కోర్లంకాలమ్మ జాతర

## అమ్మవారిని దర్శించుకున్న పేర్ని నాని, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)

**ప్రజాభూమి రూరల్-మచిలీపట్నం**

మచిలీపట్నం మండలం పోలాటితిప్ప గ్రామంలో సుమారు 16 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత శ్రీ కోర్లంకాలమ్మ జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ ఆధ్యాత్మిక వేడుకలో వైసిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మరియు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు విచ్చేసిన పేర్ని నానిని కిట్టుని గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మ



వారి ఆశీస్సులు అందరికీ ఉండాలి. ఈ సందర్భంగా పేర్ని నాని మరియు పేర్ని కిట్టు మాట్లాడుతూ.. 16 ఏళ్ల తర్వాత గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి, ఇంతటి ఘనమైన జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. పండుగ వాతావరణం జాతర సందర్భంగా పోలాటితిప్ప గ్రామం ఆధ్యాత్మిక శోభతో మెరిసిపోయింది. భారీగా తరలివచ్చిన భక్తులు సుదీర్ఘ కాలం తర్వాత జరుగుతున్న వేడుక కావడంతో పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పేర్ని నాని కిట్టు తో పాటు, లంకె వెంకటేశ్వరరావు స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తుల ఐకమత్యంతో జరుగుతున్న ఈ జాతర మహోత్సవం పట్ల పేర్ని నాని, కిట్టు హర్షం వ్యక్తం చేశారు.

# పది ఫలితాల్లో 'ప్రభుత్వ' పంతం.. టాపర్‌గా నిలిచిన అక్షిత

## మెరిసిన ఏకేటీపీఎంజీ హైస్కూల్ విద్యార్థిని.. స్మార్ట్ వాచ్‌తో సత్కరించిన కలెక్టర్ డీకే బాలాజీ

**ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం**

నేడు విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో కృష్ణా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విభాగంలో గుడివాడకు చెందిన ఏకేటీపీఎంజీ హైస్కూల్ విద్యార్థిని వట్టెం అక్షిత జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. అద్భుత ప్రతిభ 600లకు 592 మార్కులు అక్షిత మొత్తం 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి తన అసాధారణ ప్రతిభను చాటుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఈ ఫలితం నిరూపించిందని విద్యావేత్తలు కొనియాడుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక అభినందనలు జిల్లా టాపర్‌గా నిలిచిన వట్టెం అక్షితను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినిని ఘనంగా సన్మానించి, ఆమె ప్రతిభకు గుర్తింపుగా ఒక స్మార్ట్ వాచ్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్షిత విజయం జిల్లాలోని ఇతర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు, మండల విద్యాశాఖాధికారి రజిని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తమ విద్యార్థిని జిల్లా స్థాయిలో టాప్ రావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. విజేత ప్రొఫైల్ వట్టెం అక్షిత స్కూల్ ఏకేటీపీఎంజీ హైస్కూల్, గుడివాడ. సాధించిన మార్కులు 592/600 ర్యాంక్ కృష్ణా జిల్లా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ స్థానం. జిల్లా టాపర్ వట్టెం అక్షితను స్మార్ట్ వాచ్‌తో సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ. పక్కన అధికారులు యు.వి. సుబ్బారావు, ప్రమీల తదితరులు.

### మెరిసిన మాట్లం ఆణిముత్యం

# లలితా కుమారికి ఎంపీ బాలశౌరి నీరాజనం

**ప్రజాభూమి బ్యూరో-కృష్ణాజిల్లా**

పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకుతో మెరిసిన బంటుమిల్లి మండలం, మాట్లం గ్రామానికి చెందిన అర్ధాని లలితా కుమారి ప్రతిభను మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఘనంగా కొనియాడారు. ఎస్ఎస్‌సీ-2026 పరీక్షల్లో 598/600 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ కైవసం చేసుకోవడం జిల్లాకే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా సత్కారం మచిలీపట్టణం ఇన్‌చార్జ్ మరియు డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి ఎంపీ బాలశౌరి విద్యార్థినిని నేరుగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఆమె



బంగారు భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజా భూమి ప్రత్యేక హైలైట్స్:**

లక్ష్యం - 598: 600 మార్కులకు గాను కేవలం రెండు మార్కులు మాత్రమే తక్కువతో రాష్ట్ర రెండో ర్యాంకు సాధించడం లలిత అసాధారణ ప్రతిభకు నిదర్శనం.

అండగా ఉంటాం ఉన్నత చదువుల విషయంలో సరైన మార్గదర్శనం చేయడమే కాకుండా, తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ బాలశౌరి భరోసా ఇచ్చారు.

గురువుల కృషి విద్యార్థిని అద్భుత విజయానికి కారకులైన తల్లిదండ్రులను, పాఠశాల యాజమాన్యాన్ని మరియు ఉపాధ్యాయ బృందాన్ని ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించడం స్ఫూర్తిదాయకం. లలితా కుమారి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. విద్యార్థుల అభ్యున్నతి కోసం మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అనివల్లభనేని బాలశౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని లలితను అభినందనలతో ముంచెత్తారు.